ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
మంగళవారం 7 మే 2024 | 5



కూటమిని గెలిపించండి : ప్రధాని మోదీ అభివాదం

మోదీ బాణం : విల్లు ఎక్కుపెట్టిన ప్రధాని నరేంద్ర మోదీ



మోదీ సభలో ప్రజలకు నమస్కరిస్తున్న పవన్

మోదీ సభలో లోకేశ్ అభివాదం

జనామోదీ..

రాజమహేంద్రవరాన ఉప్పొంగిన ప్రజాగళం

- గోదారులన్నీ జన ప్రవాహామే
- జనంతో నిండిన రాజమహేంద్రి
- ఉభయ జిల్లాల నుంచి రాక
- కాసేపు తెలుగులో మాట్లాడిన మోదీ
- జ్ఞాపికలు అందజేసిన పవన్, లోకేశ్
- ప్రధాని మోదీ సభ విజయవంతం





చిరు కానుక : మోదీకి వేంకటేశ్వరస్వామి ప్రతిమ అందిస్తున్న పవన్‌కల్యాణ్, జనసేన అభ్యర్థులు



ఇదీ మా సంప్రదాయం : ప్రధాని నరేంద్రమోదీకి జ్ఞాపిక ఇస్తున్న టీడీపీ-బీజేపీ-జనసేన కూటమి మహిళా నేతలు

(కాకినాడ/రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

గోదావరి గడ్డపై నుంచి ప్రధాని మోదీ గర్జించారు. ఎన్నికల శంఖారావం పూరించారు. రాబోయే ఎన్నికల్లో రాజమహేంద్రవరం నుంచే కొత్త చరిత్ర సృష్టిస్తామని ప్రతినబూనారు. ఆదికవి నన్నయ సరికొత్త అధ్యాయం సృష్టించినచోటే ఎన్డీయే కూడా విజయఢంకా పూరిస్తుందని ప్రకటించారు. ఎన్నికల ప్రచార సభలో భాగంగా సోమవారం రాజమహేంద్రవరం సమీపంలోని వేమగిరిలో కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాగళం సభ దద్దరిల్లింది. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల నుంచి పోటెత్తిన జనప్రవాహంతో మార్మోగింది. అటు ప్రధాని మోదీ, ఇటు జనసేన అధినేత పవన్‌కల్యాణ్, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి తదితర దిగ్గజాల హాజరుతో సభ కొత్త కళ సంతరించుకుంది. వేలాది మంది కాషాయ టోపీలు ధరించి ఉత్సాహంగా మోదీమోదీ అంటూ నినాదాలు చేయడంతో సభ హోరెత్తింది. పవన్‌కల్యాణ్ వచ్చిన వెంటనే సభలో ఉన్న వేలాది జనం కేరింతలతో గోదావరి ఉప్పెనలా హోరెత్తింది. సరిగ్గా మధ్యాహ్నం మూడున్నరకు ప్రధాని మోదీ సభా వేదికపైకి రాగానే జనం నినాదాలు చేశారు. అటు తన ప్రసంగాన్ని మోదీ తెలుగులో ఆరంభించి అందరినీ అబ్బురపరిచారు. సభకు వచ్చిన రాజమహేంద్రవరం ప్రజలకు నమస్కారాలు అంటూనే గోదావరి తల్లికి తలవంచి నమస్కరిస్తున్నా అనడంతో ప్రాంగణం ఒక్కసారిగా మార్మోగింది. ఆదికవి నన్నయ నడయాడిన ఈ గడ్డ నుంచి ఈ ఎన్నికల్లో కొత్త అధ్యాయం సృష్టించబోతున్నామని చెప్పి గెలిచేది కూటమి ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురం, నరసాపురం లోక్‌సభ అభ్యర్థులతో పాటు అసెంబ్లీ అభ్యర్థులందరినీ గెలిపించాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం రాగానే రాజమహేంద్రవరం విమానాశ్రయం, కాకినాడ పోర్టు, జాతీయ రహదారి మరింత అద్భుతంగా అభివృద్ధి చెందుతాయని తెలిపారు. చెన్నై-కాకినాడ పారిశ్రామిక కారిడార్ పనులు ఊపందు కుంటాయని చెప్పి ఇక్కడ ప్రజల మనసు చూరగొన్నారు.

కూటమిలో ఫుల్ జోష్...

రాజమహేంద్రవరం సిటీ/రూరల్/కడియం, మే 6: కూటమి ఎన్నికల బహిరంగ సభకు విచ్చేసిన దేశ ప్రధాని నరేంద్రమోదీకి ఘన స్వాగతం లభించింది. మధ్యాహ్నం 3:30 గంటలకు సభావేదికపైకి మోదీ చేరుకున్నారు. సాయంత్రం 4:30 గంటలకు తన ప్రసంగాన్ని ముగించారు. తొలుత ప్రధాని మోదీ, జనసేన అధినేత పవన్‌కల్యాణ్, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని, రాజమహేంద్రవరం కూటమి టీడీపీ అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ శాలువాతో సత్కరించి శ్రీవేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని అందించారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే, కూటమి టీడీపీ అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి, అమలాపురం లోక్‌సభ కూటమి టీడీపీ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్, కాకినాడ ఎంపీ జనసేన అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, నరసాపురం లోక్‌సభ బీజేపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాసవర్మ, అనపర్తి కూటమి బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రాజానగరం కూటమి జనసేన అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ, రాజమహేంద్రవరం జనసేన ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, బీజేపీ నాయకులు అయ్యాజీ వేమా, కాశీవిశ్వనాథరాజు తదితరులు ప్రధాని మోదీని కలిశారు. సభా వేదికపైన కూటమి అభ్యర్థులను పలకరించారు. అనపర్తి బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మోదీ దగ్గరకు వెళ్లి పలకరించగా ఆల్‌ద బెస్ట్ అని భుజం తట్టారు. అటు లోకేశ్ తన సరదా ప్రసంగంతో మోదీని ఆకట్టుకున్నారు. ఆత్రేయపురం పూతరేకులు, తాపేశ్వరం కాజా మోదీ తినాలని అనగానే నవ్వులు పూశాయి. లోకేశ్ మాట్లాడే సమయంలో ఆయన ప్రసంగానికి మోదీ చప్పట్లు కొట్టారు. వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని లోకేశ్ మోదీకి అందించారు. మంగళగిరి నుంచి తెచ్చిన చేనేత కండువాను మోదీకి అందించారు. సభా వేదికపైకి మోదీ రాగానే పవన్ మోదీకి శాలువా కప్పారు. అనంతరం కాళ్లకు నమస్కరిస్తుండగా ప్రధాని వారించి అడ్డుకున్నారు. మోదీకి వేంకటేశ్వర స్వామి జ్ఞాపిక అందించారు. ఇలా ప్రజాగళం సభ రాజమహేంద్రవరంలో కూటమి పార్టీలకు మంచి కిక్ ఇచ్చింది. స్వయంగా మోదీ వచ్చి సభలో పాల్గొనడంతో అభ్యర్థుల్లో విజయంపై మరింత ధీమా పెంచేసింది.



అంతా ఓకేనా : ప్రధాని మోదీతో మాట్లాడుతున్న లోకేశ్



కూటమి హ్యాపీగా ఉందిలా..



నమస్తే జీ : మోదీకి నమస్కరిస్తున్న ఆదిరెడ్డి భవాని



మోదీ కటౌట్‌తో అభిమాని



ఆ ముగ్గురి కలయిక అపూర్వం : పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్/సిటీ మే 6: ప్రధాని నరేంద్ర మోదీ స్ఫూర్తి, చంద్రబాబు యుక్తి, పవన్‌కల్యాణ్ శక్తి కలయిక అపూర్వం అని, రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అభ్యర్థుల ఘన విజయం తథ్యమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, కూటమి రాజమండ్రి లోక్‌సభ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అనేది తెలుగుదేశం విధానమైతే, బాధితుల పక్షాన నిలబడి అన్యాయాన్ని ప్రశ్నించే పార్టీ జనసేన అన్నారు. కూటమి కలయిక రాష్ట్రంలో సుపరిపాలనకు దోహదపడుతుందన్నారు. యువతకు ఉద్యోగాలు రావాలన్నా, రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా కూటమి అధికారంలోకి రావాలన్నారు. గడచిన ఐదేళ్లలో మనం అన్ని రకాలుగా ఇబ్బందులు పడ్డామని, ఏ వర్గానికీ న్యాయం జరగలేదన్నారు. రాజమండ్రి ఎంపీ అభ్యర్థిగా నిలబడడం తన అదృష్టమని, ఈ ఎన్నికల్లో ఎన్డీయే కూటమిని ప్రజలు ఆశీర్వదించాలని ఆమె కోరారు.

కట్టుదిట్టమైన భద్రత

కూటమి ప్రజాగళం సభ విజయవంతమైంది. టీడీపీ, జనసేన, బీజేపీ అభిమానులతో గ్యాలరీలన్నీ నిండిపోయాయి. జనం తండోపతండాలుగా రావడంతో జాతీయ రహదారి నిండిపోయింది. మహిళలు సైతం అధిక సంఖ్యలో రావడం విశేషం. సభ పూర్తయ్యేంత వరకూ ఎండను సైతం లెక్కచేయకుండా ఓపికగా ఉన్నారు. మోదీ, పవన్, లోకేశ్ ప్రసంగాలకు పెద్దఎత్తున స్పందిస్తూ చప్పట్లతో, నినాదాలతో హోరెత్తించారు. ప్రజాగళం సభకు ప్రధాని మోదీ హాజరు కావడంతో అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. ఒక అడిషనల్ డీజీ స్వీయ పర్యవేక్షణలో ఇద్దరు ఐజీలు, తూర్పుగోదావరి ఎస్పీ జగదీశ్ సహా ఆరుగురు ఎస్పీలు.. మొత్తం సుమారు మూడు వేల మంది పోలీసులు, కేంద్ర బలగాలు బందోబస్తు నిర్వహించాయి. సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన గ్యాలరీల్లోకి చేరుకోవడానికి ముందు క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. 35 చెకింగ్ పాయింట్లను ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరినీ పరిశీలించి అనుమతించారు. బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు నిరంతర గస్తీ కాశాయి. భద్రతా చర్యల్లో భాగంగా వాటర్ బాటిల్, పెన్, సిగరెట్, అగ్గిపెట్టె, గుట్కా, పార్టీ జెండాలను అనుమతించలేదు. మోదీ రాకకు అరగంట ముందు నుంచీ.. ఆయన వెళ్లిన తర్వాత వరకూ వేదిక నుంచి హెలిపాడ్ వరకు జాతీయ రహదారిపై ఎవరినీ అనుమతించలేదు. రత్న ఫ్యాక్టరీ నుంచి వేమగిరి కూడలి వరకు పూర్తిగా పోలీసుల ఆధీనంలోకి వెళ్లిపోయింది. మోదీ వెళ్లిన తర్వాత జనం ఒక్కసారిగా తిరుగు ప్రయాణం కావడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడ్డాయి. భద్రత దృష్ట్యా వాటర్ బాటిళ్లను తీసుకెళ్లనీయకపోవడంతో గ్యాలరీలు, బయట ప్రాంగణంలో లక్షల లీటర్ల మజ్జిగ అందుబాటులో ఉంచారు. తాగునీరు కూడా ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేశారు.





జయహో మోదీ..



ప్రధానికి స్వాగతం పలుకుతున్న లోకేశ్, కూటమి అభ్యర్థులు



మోదీ సభకు



బాగున్నారా సార్ : ప్రధాని మోదీకి నమస్కరిస్తున్న పవన్



మా కూటమి టీమ్ : ప్రజాగళం వేదిక నుంచి ప్రజలకు నమస్కరిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. చిత్రంలో పవన్‌కల్యాణ్, నారా లోకేశ్, రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి, నరసాపురం ఎంపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాజమహేంద్రవరం రూరల్ అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి, నిడదవోలు అభ్యర్థి కందుల దుర్గేష్, రాజానగరం అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ, కాకినాడ, అమలాపురం ఎంపీ అభ్యర్థులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, హరీష్‌మాధుర్, అనపర్తి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కొవ్వూరు అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు, రాజమహేంద్రవరం సిటీ అభ్యర్థి ఆదిరెడ్డి వాసు



మీకోసమే సార్ : ప్రధాని మోదీకి శాలువా కప్పుతున్న లోకేశ్

చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

- జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ



జగ్గంపేట మండలం కాట్రావులపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న నెహ్రూ

జగ్గంపేట, మే 6: రాష్ట్రాభివృద్ధి, పేదల సంక్షేమం చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్‌తోనే సాధ్యమని జగ్గంపేట నియోజకవర్గం టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ అన్నారు. జగ్గంపేట మండలం కాట్రావులపల్లిలో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు సీఎం అయితే వృద్ధులకు నెలకు రూ.4వేలు పింఛను ఇంటివద్దకే తెచ్చి అందిస్తామన్నారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు ముసిరెడ్డి నాగేశ్వరరావు, యేలేటి బాబి, మాజీ సర్పంచ్ సుంకర సీతారామయ్య, కంటే రామారావు, వెన్న వీరబాబు, బిక్కిన బాబి, రాయుడు శ్రీను, సుంకర శ్రీనివాస్, పప్పు గణేష్, రాయుడు శివప్రసాద్, దోమడ శ్రీను, సందక సాంబశివ, సూరిమిల్లి సత్తిబాబు, తుమ్మా దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

'రైతులకు నీరు అందిస్తా'

వెంగయమ్మపురం, రాజపూడి గ్రామాల్లో వందలాదిమంది టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి జ్యోతుల నెహ్రూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పుష్కర ఎత్తిపోతల పథకానికి అనుసంధానంగా ఉన్న తాళ్లూరు, రాజపూడిలిఫ్ట్‌ను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించి రైతులకు పూర్తిస్థాయిలో నీరందిస్తామన్నారు.కార్యక్రమంలో వెంగయమ్మపురం, రాజపూడి గ్రామాల టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

వైసీపీనుంచి టీడీపీలో చేరిక

జగ్గంపేట మండలం బలభద్రపురంలో వైసీపీ కార్యకర్తలు జగ్గంపేట ఉమ్మడి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి నెహ్రూ పార్టీ కండువాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ బస్వా చినబాబు, పడాల బాలాజీ, కట్టమూరి రామకృష్ణ, యర్ర పరమేష్, మరోతికృష్ణ పాల్గొన్నారు.

రైతులకు ఏటా రూ.20వేలు

జగ్గంపేటమండలం బలభద్రపురం, సీతానగరం గ్రామాల్లో నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ చైతన్యరథంపై ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయనకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఉమ్మడి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రతి రైతుకు సంవత్సరానికి రూ.20వేలు ఆర్థిక సాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో కట్టమూరి రామకృష్ణ, మరోతి కృష్ణ, యర్ర పరమేష్, ముత్యాల సత్యనారాయణ, కోడూరి సత్యనారాయణ, కాకర్ల కృష్ణాజీ, ఉప్పులూరి మల్లయ్య జనసేన నాయకులు, సింగంశివ, శిరంశెట్టి ఉదయ భాస్కర్, రాయుడు కుటుంబం పాల్గొన్నారు.

మామిడాడ గ్రామంలో జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ సతీమణి జ్యోతుల మణి ఇంటింటికీ తిరుగుతూ కూటమి ఎంపీ,ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని కోరారు.



జగ్గంపేట మండలం బలభద్రపురంలో టీడీపీలో చేరిన వారితో నెహ్రూ

నేడు సీఎం జగన్ రాక 7లో..

ఉపాధ్యాయులే టార్గెట్ 6లో..



అభ్యర్థితో.. ఒకరోజు

కాకినాడ నగరంలోని కొండయ్యపాలెంలో ఎన్నికల ప్రచారం సాగిస్తున్న వనమాడి

ఉధృతంగా.. వ్యూహాత్మకంగా ప్రచారం



పొద్దున్నే వార్తాపత్రిక చదువుతున్న కొండబాబు

రాష్ట్రంలో మరో ఆరురోజుల్లో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ జరగనుంది. అందుకు అనుగుణంగా కాకినాడ సిటీ అసెంబ్లీ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబు కాకినాడ నగరంలో ప్రచారం ఉధృతం చేశారు. కొద్దిపాటి సమయం కూడా తీరికలేకుండా బిజీబిజీగా ఉన్న వనమాడి కొండబాబుతో ఆంధ్రజ్యోతి 'అభ్యర్థితో ఒకరోజు' నిర్వహించింది. సోమవారం ఉదయం ఐదుగంటలకే నిద్రలేచిన ఆయన గంటపాటు వ్యాయామం చేసి 9గంటలకు ప్రచార వ్యూహాలపై సమాలోచనలు చేశారు. 10గంటలకు పార్టీలో చేరికలు జరగ్గా 12గంటలకు మీడియా సమావేశం జరిగింది. తర్వాత బూత్‌లెవెల్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించగా 3గంటలకు భోజనంచేశారు. 5గంటలకు పార్టీశ్రేణులతో సమావేశం నిర్వహించగా 6గంటలకు పార్టీలో చేరికలు జరిగాయి. అక్కడినుంచి కొండయ్యపాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాత్రి 9గంటలకు ఇంటికి చేరుకున్నారు. -వివరాలు 7వపేజీలో..

కూటమి వికాసం


సభకు హాజరైన జనం




బుచ్చయ్యచౌదరి


నల్లమిల్లి రామకృష్ణారెడ్డి


ఆదిరెడ్డి శ్రీనివాస్



ముప్పిడి వెంకటేశ్వరరావు

మూడు పార్టీల ముచ్చట్లు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

రాజమహేంద్రవరం రూరల్ వేమగిరిలో సోమవారం జరిగిన ప్రజాగళం సభలో మూడు పార్టీల ముచ్చట్లు కనిపించాయి. ప్రధాని నరేంద్రమోదీ రాక ముందే వేదిక గోదావరి జిల్లాలో పార్లమెంట్ అభ్యర్థులు, ఎమ్మెల్యేల అభ్యర్థులు, టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు ఆశీనులయ్యారు. పవన్‌కల్యాణ్ పక్కన బీజేపీ మాజీ అధ్యక్షుడు వీర్రాజు కూర్చున్నారు. పవన్ వేదిక మీదకురాగా అభివాదాలు చేసుకున్నారేకానీ తర్వాత వీరు మాట్లాడుకున్నట్టు లేదు. బిజెపి అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, నారా లోకేశ్ పక్కపక్కనే కూర్చున్నారు. పురందేశ్వరి, నారా లోకేశ్ తల్లి భువనేశ్వరి సొంత అక్కాచెల్లెళ్లు అన్న సంగతి తెలిసిందే. లోకేశ్ ఆమెకు కొడుకు అవుతారు. కానీ వీరిద్దరి పార్టీలు వేరు. ఇవాళ పొత్తు వల్ల ఒకే వేదిక మీద కూర్చునే అవకాశం లభించింది. దీనితో కాసేపు ఇద్దరూ ఏవేవో మాట్లాడుకోవడాన్ని సభలోని వారూ ఆసక్తిగా గమనించారు. మరోపక్క గోరంట్ల బుచ్చయ్యచౌదరి, కందుల దుర్గేష్, బత్తుల బలరామకృష్ణ పక్కపక్కనే కూర్చుని మాట్లాడుకున్నారు. తర్వాత గోరంట్ల, పవన్ వద్దకు కూడా వెళ్లి కొద్దిసేపు మాట్లాడారు. గోరంట్ల, కందుల నవ్వుతూ మాట్లాడుకోవడం కనిపించింది. ముందు లోకేశ్, తర్వాత పవన్ వేదిక మీదకు రాగానే అందరూ ఒకరినొకరు పలకరించుకున్నారు. మోదీ రాగా అందరూ అభివాదం చేశారు. అనపర్తి బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని పురందేశ్వరి మోదీకి పరిచయం చేశారు. ఆయన భుజం తట్టి అభినందించారు. ఇంకా వేదిక మీద ఆదిరెడ్డి వాసు, మద్దిపాటి వెంకట్రాజు, ముప్పిడి వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే అయ్యాజీవేమా, బీజేపీ నేత కాశీవిశ్వనాథరాజు తదితరులు పాల్గొన్నారు. ఇక వేదిక మీద టీడీపీ, జనసేన, బీజేపీ కండువాలతో నాయకుల మధ్య ఐక్యత కనిపించింది. వేదిక ముందు జనం చేతుల్లో కూడా మూడు పార్టీల జెండాలు రెపరెపలాడాయి. బొమ్మూరు నుంచి వేమగిరి వరకూ హైవే నిండా టీడీపీ, జనసేన, బీజేపీ జెండాలు రెపరెపలాడాయి.


మోదీ కటౌట్‌తో మహిళా అభిమాని


మోదీ ఫొటోలతో..


టోపీలతో సభా ప్రాంగణానికి వెళ్తున్న మహిళలు


లోకేశ్‌తో మహిళా నేతల సెల్ఫీ


లోకేశ్‌తో హరీష్, ముప్పిడి, ఆదిరెడ్డి


లోకేశ్‌తో బత్తుల


ఉదయ్‌శ్రీనివాస్, హరీష్‌మాధుర్

జగన్ పాలనలో అన్ని వర్గాలకు దగా

రాజమహేంద్రవరం రూరల్ టీడీపీ అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి

రాజమహేంద్రవరం అర్బన్/సిటీ మే 6: అన్నివర్గాల ప్రజలను జగన్ దగా చేశాడని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. ప్రజల్ని నమ్మించి మోసం చేశాడని.. అరాచక, దోపిడీ పాలనతో ప్రజలు విసుగుచెంది ఉన్నారని చెప్పారు. సోమవారం రాజమహేంద్రవరం సమీపంలోని వేమగిరిలో ప్రధాని మోదీ, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్, తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పాల్గొన్న బహిరంగ సభలో బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ రాష్ట్రం బాగా వెనుకబడి ఉందని, ఇటువంటి తరుణంలో కేంద్ర సహకారం కావాలన్నారు. అందుకే కూటమిని గెలిపిస్తే అభివృద్ధి సాధ్యమౌతుందన్నారు. రాజమహేంద్రవరం సిటీ అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే కూటమి ద్వారానే సాధ్యమన్నారు. దేశంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేశ్‌ల సారథ్యంలో అభివృద్ధి, సంక్షేమం, నిరుద్యోగ సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. అనపర్తి ఎమ్మెల్యే అభ్యర్థి నల్లిమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి రాబోతుందన్నారు. గత ఐదేళ్లుగా జగన్ పరిపాలన దోపిడీలు అక్రమాలు అరాచకాలతో సాగిందన్నారు. ప్రజలకు న్యాయం జరగలేదన్నారు. రైతాంగం తీవ్రంగా నష్టపోయిందన్నారు. రాజానగరం ఎమ్మెల్యే అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ మోదీ, పవన్‌కల్యాణ్, చంద్రబాబుల కలయిక రాష్ట్ర భవిష్యత్తుకు మంచిదన్నారు. కూటమి విజయం సాధిస్తుందని, ప్రజలు జగన్‌ను సాగనంపడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరావు మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్నా, పరిశ్రమలు తీసుకువచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నా, పేదరికం నిర్మూలించాలన్నా కూటమి అధికారంలోకి రావాలన్నారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీ విశ్వనాథరాజు మాట్లాడుతూ రష్యా-ఉక్రెయిన్ యుద్ధం జరుగుతున్న సమయంలో 23వేల మంది భారత్‌కు చెందిన విద్యార్థులు చిక్కుకున్నారని వారికోసం ప్రధాని మోదీ.. ఇరు దేశాధినేతలకు ఫోన్‌చేసి ఆరు గంటలపాటు యుద్ధాన్ని ఆపించి మన విద్యార్థులను దేశానికి తరలించారని, అది మోదీ సత్తా అని గుర్తుచేశారు. అటువంటి నేత మూడోసారి ప్రధాని అయితే దేశం ఇంకా వేగంగా అభివృద్ధి పథంలో పరుగులు పెడుతుందన్నారు. కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. వికసిత్ భారత్ ధ్యేయంగా ముందుకు సాగాలన్నారు. నరసాపురం ఎంపీ బీజేపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ మాట్లాడుతూ కేంద్రంలోను, రాష్ట్రంలోను ఎన్‌డీఏ అధికారంలోకి రాబోతుందన్నారు. రాష్ట్రంలో వ్యవస్థలను జగన్ నాశనం చేశాడన్నారు. ప్రపంచలోనే 5వ ఆర్థికశక్తిగా భారత్‌ను తీర్చిదిద్దిన ఘనత మోదీకి దక్కుతుందన్నారు.


వేదికపై లోకేశ్, పవన్, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

ఉపాధ్యాయులే టార్గెట్

పోస్టల్ బ్యాలెట్‌లో ఓట్లు గందరగోళం

కాజులూరు ఉపాధ్యాయులకు అమలాపురంలో

టీచర్ల ఓట్లు చెల్లాచెదురు


కాకినాడ పీఆర్ కళాశాలలో ఓట్లు పరిశీలిస్తున్న టీచర్లు

కలెక్టరేట్(కాకినాడ), మే 6: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులను టార్గెట్ చేసినట్లు కనిపిస్తోంది. ఉపాధ్యాయుల ఓట్లను చెల్లాచెదురు చేసింది. కాజులూరు మండలంలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుల ఓట్లు కాకినాడలో కాకుండా అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో వేయాలని అధికారులు సూచిస్తున్నారు. ఇతర ఉద్యోగుల తరహాలో కాకినాడ పీఆర్ ప్రభుత్వ కళాశాలలో ఓటు వేద్దామని వచ్చిన కాజులూరు ఉపాధ్యాయులకు సోమవారం నిరాశ ఎదురైంది. ఓటర్ల జాబితాలో ఓట్లు లేవని ఎన్నికల అధికారులు చెప్పడంతో ఖంగుతిన్నారు. కాజులూరు మండలంలో పనిచేస్తున్న తమకు రామచంద్రపురంలో గాని, నివాసం ఉంటున్న కాకినాడలో గాని ఓటు వేసే అవకాశం ఉండాలన్నారు. వింతగా అమలాపురంలో ఉన్న పోలింగ్ కేంద్రంలో ఓటు వేయాలని ఆదేశించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఎక్కడైతే ఉద్యోగులు ఎన్నికల విధులపై శిక్షణ తీసుకుని పోస్టల్ బ్యాలెట్‌కి దరఖాస్తు చేశారో దాన్ని అనుసరించి ఓట్లు వివిధ ప్రాంతాలలో కేంద్రాలకు కేటాయించినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ఉపాధ్యాయులపై ఉన్న కక్ష నేపథ్యంలో ప్రభుత్వం ఓట్లు చెల్లాచెదురు చేసిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఓటుకు రూ.5వేలు

ప్రభుత్వ ఉద్యోగులకు ఓటుకు రూ.5 వేలు వైసీపీ నాయకులు పంపిణీ చేసినట్లు ముమ్మరంగా ప్రచారం జరుగుతుంది. జిల్లాల్లో అర్బన్ ప్రాంతంలో ఓటుకు రూ.5వేలు ఇతర ప్రాంతాలలో రూ.3వేలు వైసీపీ నాయకులు పంపిణీ చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సెంటిమెంట్ ఆలయం

- రాజకీయ నాయకులకు నేమాం ఆలయం అంటే ఓ నమ్మకం
- నామినేషన్ దగ్గర నుంచి ప్రచారం వరకు ఉమారామలింగేశ్వరస్వామిని దర్శించుకున్న తర్వాతే ఏదైనా..
- లోక్‌సభ దివంగత స్పీకర్ బాలయోగికి కూడా ఈ ఆలయం ఓ సెంటిమెంట్

సర్పవరం జంక్షన్, మే 6: కాకినాడ రూరల్ మండలం ఈశాన్యం దిక్కులో ఉన్న గ్రామం నేమాం. ఈ గ్రామం తీరప్రాంతానికి సమీపంలో ఉంటుంది. ఈ గ్రామంలో శ్రీపర్వత వర్ధినీసమేత శ్రీఉమారామలింగేశ్వరస్వామి ఆలయం చాలా ప్రసిద్ధి చెందింది. ముఖ్యంగా రాజకీయ నాయకులకు సెంటిమెంట్ ఆలయం ఇది. ఎన్నికలు వస్తున్నాయంటే చాలు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు, ముఖ్యంగా ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు తప్పనిసరిగా నేమాం వచ్చి శ్రీ ఉమారామలింగేశ్వరస్వామి ఆలయాన్ని దర్శిస్తారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరమే నామినేషన్ వేసేందుకు వెళతారు. ఎన్నికల ప్రచారం కూడా ఇక్కడ నుంచే లాంఛనంగా ప్రారంభిస్తారు. శ్రీ ఉమారామలింగేశ్వరస్వామిని దర్శించుకుంటే రాజకీయ భవిష్యత్తు ఉంటుందని రాజకీయ నాయకుల నమ్మకం.



బాలయోగికి ఎంతో నమ్మకం

లోక్‌సభ మాజీ స్పీకర్ బాలయోగి రాజకీయంలోకి ప్రవేశించే ముందు కాకినాడ రూరల్ మండలానికి ఈశాన్య దిక్కులో ఉన్న నేమాం వచ్చి శ్రీ ఉమారామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అక్కడ నుంచి ఎన్నికలు జరిగిన ప్రతీసారి నేమాం వచ్చి బాలయోగి పూజలు చేసిన తర్వాతే నామినేషన్ దాఖలు చేయడం, ఎన్నికల ప్రచారం నిర్వహించడం అలవాటుగా మారింది. జడ్పీ ఛైర్మన్‌గా ఎన్నికల బరిలోకి దిగిన తర్వాత ఎస్ఆర్ఎంటీ చౌదరి వెంట వచ్చి స్వామివారిని దర్శించుకున్న తర్వాతే నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం ఎన్నికల్లో విజయం సాధించడం, జడ్పీ ఛైర్మన్‌గా రాజకీయ ప్రస్థానం కొనసాగించడం చకచకా జరిగిపోయాయి. అక్కడ నుంచి ఎమ్మెల్యే, ఎంపీగా, లోక్‌సభ స్పీకర్‌గా రాజకీయాల్లో ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించారు. అప్పటి నుంచి రాజకీయ నాయకుల దృష్టి నేమాం గ్రామంపై పడింది. కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజు, మాజీ ఎమ్మెల్యేలు పిల్లి అనంతలక్ష్మి, తిరుమాని సత్యలింగనాయకర్, అనిశెట్టి బుల్లిఅబ్బాయిరెడ్డి నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే కురసాల కన్నబాబు వరకు ఎన్నికల్లో పోటీ చేసే ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు ఇండిపెండెంట్‌గా పోటీ చేసే వారు సైతం ఈ ఆలయాన్ని దర్శించుకుంటారు. నామినేషన్ వేసే ముందు, నామినేషన్ వేసిన తర్వాత, ఎన్నికల ప్రచారం ప్రారంభించే ముందు ఇక్కడకు వచ్చి పూజలు చేస్తారు.


పూజలు నిర్వహిస్తున్న పంతం నానాజీ (ఫైల్)

ఓటేయడానికి లండన్ నుంచి..


లండన్ నుంచి వచ్చిన యువకులు

నిడదవోలు, మే 6: ఆ యువకులు ఇద్దరూ లండన్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు. ఎక్కడున్నా సొంత గ్రామం, సొంత రాష్ట్రం అంటే విపరీతమైన అభిమానం. ఈ నెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు లండన్ నుంచి స్వగ్రామం నిడదవోలు మండలం శెట్టిపేట చేరుకున్నారు. ఈ ఇద్దరిలో ఒకరైన గంధం లోకేష్ మాట్లాడుతూ నిడదవోలు నియోజకవర్గాన్ని ఎవరు అభివృద్ధి చేయగలుగుతారో వారికే ఓటు వేయాలన్నారు. నిడదవోలు అభివృద్ధికి మేము సైతం అంటూ ఓటు హక్కును వినియో గించుకునేందుకే లండన్ నుంచి వచ్చామని తెలిపారు.

అభ్యర్థుల హైటెక్ ప్రచారం



ఈ సారి ఎన్నికల ప్రచారం హైటెక్‌గా సాగుతోంది. ప్రచారాలను పార్టీలు పూర్తిగా మార్చేశాయి. కొత్తపేట అసెంబ్లీ కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు, అమలాపురం లోక్‌సభ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్ చంద్రబాబు హయాంలో జరిగిన ప్రగతిని వివరిస్తూ ఎల్ఈడీ స్క్రీన్లపై ప్రచారం చేస్తున్నారు. అంతేగాక ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేసుకుని మాధ్యమాల ద్వారా ప్రచారం సాగిస్తున్నారు. వాట్సాప్ గ్రూపులు పెట్టి అభ్యర్థుల ప్రచారాలను స్మార్ట్‌ఫోన్లలో పంపిస్తున్నారు.

● ఆత్రేయపురం

ఎన్నికల బందోబస్తుకు రాజస్థాన్ బలగాలు

పిఠాపురం, మే 6: ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న ఎన్నికలకు రాజస్థాన్ నుంచి ప్రత్యేక పోలీసు బలగాలు బందోబస్తుకు వచ్చాయి. మన రాష్ట్రంలో మే 13వ తేదీన జరగనున్న అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల బందోబస్తుకు రాష్ట్రంలో ఉన్న పోలీసు బలగాలు సరిపోవు. దీంతో ఎన్నికలు పూర్తయిన రాష్ట్రాల నుంచి పోలీసు బలగాలను రప్పించి ఇక్కడ బందోబస్తు నిమిత్తం వినియోగిస్తున్నారు. ఈ ప్రక్రియలో భాగంగా రాజస్థాన్‌కు చెందిన ప్రత్యేక పోలీసు బలగాలు కాకినాడ జిల్లాకు చేరుకున్నాయి. అందులో మూడు ప్లాటూన్ల రాజస్థాన్ స్పెషల్ పోలీసులను పిఠాపురం నియోజకవర్గానికి కేటాయించారు. ఈ మూడు ప్లాటూన్లలో 240 మంది సిబ్బంది ఉంటారు. వారు సోమవారం గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో కవాతు నిర్వహించి గ్రామంలో బందోబస్తు పర్యవేక్షణకు వచ్చారు.


రాజస్థాన్ నుంచి వచ్చిన ప్రత్యేక పోలీసు బలగాలు

ఆపరేషన్ ఆకర్ష్ ట్రెండ్!

- ఆ పార్టీ వాళ్లు ఈ పార్టీలోకి.. ఈ పార్టీ వాళ్లు ఆ పార్టీలోకి జంప్
- ప్రచారానికి నేతలు వచ్చే ముందు రోజు వీధుల్లో మందు పార్టీలు

ఉప్పలగుప్తం, మే 5: ఎన్నికల్లో రాజకీయ పార్టీలు ఓటర్లను ఆకర్షించేందుకు వినూత్న సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం చూస్తుంటాం. అవతలి పార్టీ వారిని తమ వైపు ఆకర్షించేందుకు ఇప్పటికే ఆకర్ష్ పథకం అమలులో ఉన్న సంగతి తెలిసిందే. కాగా 2024 ఎన్నికల్లో కొత్తగా 'ఆకర్ష్ ఆర్భాట్' పథకం పురుడుపోసుకుంది. దీని అమలుకు అన్ని రాజకీయ పార్టీలు పోటీపడుతున్నాయి. ఈ ఆకర్ష్ ఆర్భాటం ఏమిటని సందేహం వచ్చింది కదా! ఈ పథకం ఎన్నికల ప్రచార సమయంలో మాత్రమే ఆయా గ్రామాల్లో అమలులో ఉంటుంది. పోటీలో ఉన్న పార్టీల అభ్యర్థులకు ప్రచార షెడ్యూల్ ఉంటుంది. తాము ప్రచారానికి వెళ్లే గ్రామంలో రెండు రోజులు ముందుగానే సదరు పార్టీ కీలక నేతలు ఆ గ్రామంలో ప్రత్యర్థి పార్టీల నాయకులు, కార్యకర్తలను తమవైపు తిప్పుకునేందుకు రాత్రి సమయాల్లో మందు పార్టీలు ఏర్పాటు చేస్తారు. అంతే కాకుండా పలు ప్రలోభాల వలలు విసురుతారు. ఈ ప్రయత్నంలో కనీసం కొందరైనా ప్రభావితులవుతారు కదా! అయితే ఇక్కడ మరో సరికొత్త ఆకర్ష్‌కు తెర తీశారు. ప్రత్యర్థి పార్టీకి చెందిన గ్రామ కమిటీ, మండల కమిటీ అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీ పదవుల్లో ఉన్న వారు లేదా మాజీలను ప్రధానంగా ఎంచుకుంటున్నారు. ప్రచారం రోజున భారీ ఆర్భాటంతో ఆకర్షితులకు తమ పార్టీ కండువాలు వేస్తారు. వారిని తీసుకుని ఆ గ్రామంలో ప్రచారం నిర్వహిస్తారు. దీని ప్రత్యేకత ఏమిటంటే ప్రత్యర్థి పార్టీల ముఖ్యులు తమవైపు ఆకర్షితులవుతున్నారని ఓటర్లను నమ్మించడం. ప్రత్యర్థులు బలహీనపడుతున్నారన్న సంకేతాలను జనంలోకి పంపడమన్నమాట. ఈ పథకాన్ని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో జోరుగా అమలు చెయ్యడం రోజూ చూస్తున్నాం కదా!!

కొత్తపల్లి కొబ్బరి రేటు పైపైకి



కొత్తపల్లి, మే 6: మామిడి పండ్లలో రారాజు కొత్తపల్లి కొబ్బరి. ఎంతరేటుకైనా సంవత్సరానికి ఒక్కసారైన కొనుక్కొని తినాలనిపించే అమృతఫలం లాంటి మామిడి పండు కొబ్బరి మామిడి అని అంటుంటారు. ఈ ఏడాది కొబ్బరి మామిడి చెట్లు పూత ఆశాజనకంగా ఉన్నప్పటికీ కాయలుగా మార్పు చెందే క్రమంలో మంచు దెబ్బకు పూత పూర్తిగా మాడిపోవడంతో మామిడి కాయల కాపు తగ్గింది. దీంతో అక్కడక్కడ ఉన్న పూతలతో కాసిన కాయలను పండ్లు తయారు చేసి అమ్మకానికి సిద్ధం చేశారు. పచ్చికొబ్బరి మామిడి కాయలతో ఈ సీజన్లో అవకాయ పెట్టి కొత్తగా పెళ్లయిన వారి అత్తారింటికి పంపడం స్టేటస్‌గా బావిస్తారు. పచ్చడికి పెట్టేందుకు 100 పచ్చికొబ్బరి మామిడి కాయలు రూ.6 నుంచి 7వేల వరకు రేటు పలుకుతుంది. అదే విధంగా కొబ్బరి మామిడి పండ్లు పరక అంటే 14 కాయలు రేటు రూ.750 వరకు ఉంటుంది. అయినప్పటికీ మార్కెట్లో ఎక్కడా కొబ్బరి మామిడిపండ్లు దొరకకపోవడంతో దొరికిన పండ్లను చెప్పిన రేటుకు ఎగరేసుకొని పోవడం గమనార్హం.

పట్టాలు తప్పిన గూడ్స్



రాజమహేంద్రవరం, మే 6(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి రైల్వేస్టేషన్‌లో ఓ గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. పారాదీప్ నుంచి బళ్లారి ఎరువుల లోడుతో వెళుతున్న గూడ్స్ రైలు సోమవారం ఉదయం 6.30కు రైల్వేస్టేషన్‌లోని రెండో ప్లాట్‌ఫాంకు చేరుకుంటున్న సమయంలో ఓ బోగీ రెండు చక్రాలు పట్టాలు తప్పాయి. స్టేషన్ కావడంతో రైలు నెమ్మదిగా ప్రయాణిస్తుండడంతో పెద్ద ప్రమాదం తప్పింది. పట్టాలు తప్పిన బోగీని వేరుచేసి రైలును పంపించేశారు.

రోడ్డు ప్రమాదంలో భార్య మృతి

భర్తకు తీవ్ర గాయాలు



యజ్జల పంపాదమ్మ

పిఠాపురం, మే 6: పిఠాపురంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య మరణించగా, భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. తొండంగి మండలం ఎర్రయ్యపేట పంచాయతీ వి.కొత్తకోట గ్రామానికి చెందిన యజ్జల అప్పారావు, పంపాదమ్మ (55)లు పిఠాపురం పట్టణం జగ్గయ్యచెరువు కాలనీ సమీపంలోని వైభవ్ వెంచర్స్‌లో నివాసముంటున్నారు. వారు పిఠాపురం నుంచి కోనపాపపేట వెళ్లేందుకు మోటార్ సైకిల్‌పై బయలుదేరారు. ఉప్పాడ బస్టాండ్ వద్దకు వచ్చేసరికి లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ప్రమాదంలో పంపాదమ్మ మరణించగా, భర్త అప్పారావుకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమయిన లారీ డ్రైవర్ దురుసుగా ప్రవర్తించడంతో పిఠాపురం ప్రభుత్వాసుపత్రి వద్ద ఉద్రిక్తత ఏర్పడింది. పోలీసుల జోక్యంతో వివాదం సద్దుమణిగింది. ప్రమాదం విషయం తెలుసుకుని అక్కడకు వచ్చిన కుమారులు బాబ్జి, రమణలు తల్లి మృతదేహం వద్ద కన్నీరుమున్నీరుగా విలపించారు. కాగా పంపాదమ్మకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పిఠాపురం పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ మూకల దాడి దారుణం

జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు



నల్లల శ్రీధర్‌ను పరామర్శిస్తున్న వేములపాటి అజయ్‌కుమార్



తాటిపర్తిలో మోహరించిన పోలీసు బలగాలు

పిఠాపురం, మే 6: జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు మద్దతుగా గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో రోడ్‌షో నిర్వహిస్తున్న మెగా హీరో సాయిధరమ్ తేజ్‌పై వైసీపీ రౌడీమూకలు దాడి చేసే ప్రయత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు జనసేన ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు తెలిపారు. వైసీపీ మూకలు విసిరిన గాజు ముక్కలు తగిలి స్థానిక జనసైనికుడు నల్లల శ్రీధర్‌కు తీవ్ర గాయాలు కావడం చాలా బాధాకరమని చెప్పారు. పిఠాపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీధర్ త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నామని చెప్పారు. జనసేన ర్యాలీ సందర్భంగా వైసీపీ రౌడీలు ఘర్షణ వాతావరణం సృష్టించి జనసైనికులను భయాందోళనలకు గురిచేసేందుకు రాళ్లు, గాజు సీసాలు విసిరే ప్రయత్నం చేశారని చెప్పారు. వైసీపీ జెండాలు ప్రదర్శిస్తూ జనసైనికులపై కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నా పోలీసు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. వైసీపీ మార్కు రౌడీయుజంతో బెదిరించాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రజలు భయాందోళనలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్ అధికారులు కోరుతున్నట్లు తెలిపారు. కాగా ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీధర్‌ను జనసేన జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయ్‌కుమార్ పరామర్శించారు. సంఘటన గురించి తెలుసుకున్నారు.

పోలీసు బలగాల మోహరింపు

గొల్లప్రోలు రూరల్, మే 6: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో పోలీసు బలగాలను మోహరించారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు మద్దతుగా రోడ్‌షో నిర్వహిస్తున్న మెగా హీరో సాయిధరమ్‌తేజపై వైసీపీ శ్రేణులు డ్రింక్‌బాటిల్ విసిరి దాడి చేసేందుకు ప్రయత్నించగా, ఆయన త్రుటిలో తప్పుకున్నారు. అయితే ఆ గాజు సీసా తగిలి జనసైనికుడు నల్లల శ్రీధర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో జనసేన, వైసీపీ శ్రేణుల మధ్య వాగ్వివాదం, తోపులాట చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామంలో మూడు బెటాలియన్ల పోలీసు బలగాలను సోమవారం మోహరించారు. గ్రామంలో కవాతు నిర్వహించారు. ఇక్కడ ప్రత్యేకంగా పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. పరిస్థితిని కాకినాడ డీఎస్పీ హనుమంతరావు, ట్రైనీ డీఎస్పీ ప్రమోద్, పిఠాపురం సీఐ శ్రీనివాస్ తదితరులు పర్యవేక్షించారు.

ఇద్దరు వైసీపీ నేతల అరెస్టు

గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో ఆదివారం రాత్రి డ్రింక్‌బాటిల్‌తో సాయిధరమ్‌తేజ్‌పై దాడి చేయడంతో పాటు జనసైనికుడు నల్లల శ్రీధర్‌కు తీవ్ర గాయాలయిన సంఘటనకు సంబంధించి వైసీపీ యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు ఉంగరాల వీరబాబు, ఆ పార్టీ నాయకుడు వెంకటరమణలను గొల్లప్రోలు పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. 41 సీఆర్‌పీసీ కింద నోటీసులు ఇచ్చి పోలీసులు ముందుగా విచారణకు పిలిచారు. వైసీపీ నేతలు ఇరువురిని గొల్లప్రోలు పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. అనంతరం వారు బెయిల్‌పై విడుదలయ్యారు. అంతకు ముందు జరిగిన సంఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు. ట్రైనీ డీఎస్పీ ప్రమోద్, పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ బాలాజీలు సంఘటన వివరాలను అక్కడ ఉన్న వారి నుంచి సేకరించారు. కాగా డ్రింక్‌బాటిల్‌తో దాడి సంఘటనలో తీవ్రంగా గాయపడిన నల్లల శ్రీధర్‌ను మెగా హీరో సాయిధరమ్ తేజ్ చేబ్రోలులోని పవన్‌కల్యాణ్ నివాసంలో పరామర్శించారు.

సాయిధరమ్‌తేజ్‌పై దాడి అవాస్తవం: ఎస్‌డీపీవో

కాకినాడ క్రైం, మే 6: సినీ నటుడు సాయిధరమ్‌తేజ్‌పై దాడి జరిగిందని సామాజిక మాధ్యమాల్లో వస్తున్న అంశం అవాస్తమని కాకినాడ సబ్ డివిజన్ పోలీస్ అధికారి(ఎస్‌డీపీవో) కె.హనుమంతరావు పేర్కొన్నారు. కాకినాడలోని ఆయన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఎస్‌డీపీవో ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. జనసేన పార్టీకి మద్దతుగా ఆదివారం తాటిపర్తిలో సాయిధరమ్‌తేజ్ రోడ్‌షో జరుగుతుండగా ఆగంతకులు గాజుబాటిల్‌తో దాడి చేయడంతో అతనికి ప్రమాదం తప్పి పక్కనే ఉన్న నల్లశ్రీధర్ అనే వ్యక్తికి గాయమైనట్లు మీడియాలో ప్రచారం జరిగింది. అప్రమత్తమైన జిల్లా పోలీస్‌శాఖ యుద్ధ ప్రాతిపదికన విచారణ చేపట్టినట్లు ఎస్‌డీపీవో వెల్లడించారు. సాయిధరమ్‌తేజ్ రోడ్‌షోనుంచి వెళ్లిపోయిన తర్వాత ఈ సంఘటన జరిగిందని, శ్రీధర్‌కు రాయి తగిలినట్లు విచారణలో నిర్ధారణ అయినట్లు ఎస్‌డీపీవో స్పష్టం చేశారు.

వైసీపీ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలి : నాగబాబు

పిఠాపురం, మే 6: రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు పిలుపునిచ్చారు. పిఠాపురంలో సోమవారం వైసీపీకి చెందిన పాదగయ (కుక్కుటేశ్వరస్వామి దేవస్థానం) మాజీ చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు, నీటి సంఘం మాజీ అధ్యక్షుడు కొత్తెం బాబూరావు, మార్కెట్‌యార్డు డైరెక్టర్ చక్రవర్తుల శ్రీను, లారీ యూనియన్ మాజీ అధ్యక్షుడు కర్నీడి నానాజీ(పెదకాపు) తదితరులు నాగబాబు సమక్షంలో జనసేనలో చేరారు. జనసేనలో చేరిన వారిలో దాసరి బుజ్జి, కర్నీడి మాణిక్యాలరావు, పంతం వెంకటరమణ, దూళిపూడి కొండలరావు, ఈపు శ్రీను తదితరులు ఉన్నారు.

విజయజనార్ధనస్వామి కల్యాణోత్సవాలు నిర్వహిస్తాం

రమణక్కపేట (కొత్తపల్లి), మే 6: మండలంలోని రమణక్కపేటలో శ్రీవిజయజనార్ధనస్వామి కల్యాణమహోత్సవాలు, జాతరను ఘనంగా నిర్వహిస్తామని జనసేన ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు తెలిపారు. టీడీపీ రాష్ట్ర అధికారప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ ఆధ్వర్యంలో రమణక్కపేట విజయజనార్ధనస్వామి ఆలయంలో నిర్వహించిన సమావేశంలో నాగబాబు మాట్లాడారు. పిఠాపురం నుంచి కూటమి అభ్యర్థిగా పోటీచేస్తున్న పవన్ గుర్తు గాజు గ్లాసుపై ఓట్లేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని గ్రామస్తులను కోరారు. ఎమ్మెల్యేగా నెగ్గిన వెంటనే విజయజనార్ధనస్వామి జాతర వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. వర్మ మాట్లాడుతూ రమణక్కపేట రైతుల సమస్యలను తప్పక పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. బీజేపీ పిఠాపురం కన్వీనర్ డాక్టర్ బుర్రా వరుణ్ కృష్ణంరాజు, జనసేన నాయకులు మహేంద్రరెడ్డి, మర్రెడ్డి శ్రీనివాస్, తెలగంశెట్టి వెంకటేశ్వరరావు, అనిశెట్టి సత్యానందరెడ్డి, పెనుమల్లు కృష్ణారెడ్డి, బాబీ పాల్గొన్నారు.

అధ్యాపకులకు పరిశోధనా నగదు ప్రోత్సాహకాలు

జేఎన్టీయూకే, మే 6: వర్సిటీలోని అధ్యాపకులను పరిశోధనా ప్రాజెక్టుల్లో ప్రోత్సహించడానికి జేఎన్టీయూకే ద్వారా పరిశోధనా నగదు ప్రోత్సాహకాలు అందించడం ద్వారా విద్యార్థుల పరిశోధనా ప్రాజెక్టులకు అధ్యాపకులు మరింత తోడ్పాటునందించగలరని ఉపకులపతి జీవీఆర్ ప్రసాదరాజు అన్నారు. ప్రాంగణంలోని వీసీ సమావేశ హాల్లో ఐక్యూఏసీ డైరెక్టరేట్‌కు సంబంధించిన కార్యక్రమాలపై సోమవారం వీసీ సమీక్షించారు. దీనిలో రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ ఎల్.సుమలత, డైరెక్టర్లు పాల్గొనగా ఐక్యూఏసీ డైరెక్టర్ ఎస్.బాలాజీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ న్యాక్ మార్గదర్శకాలను అనుసరించి రెగ్యులర్ ప్రాతిపదికన ఐక్యూఏసీ సమావేశాలను నిర్వహించి వర్సిటీలో చేపట్టిన నాణ్యతాపరమైన కార్యక్రమాలు, రానున్న రోజుల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై వివరించారు. అనంతరం ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ కళాశాలలో కోడింగ్ క్లబ్‌ను ప్రారంభించామన్నారు. సమావేశంలో ఐఎస్టీ డైరెక్టర్ ఏ.గోపాలకృష్ణ, ఐఐఐపీటీ డైరెక్టర్ బీటీ కృష్ణ, బాదం బాలకృష్ణ, డాక్టర్ మధు పాల్గొన్నారు.

'కూటమి గెలుపు ఖాయం'

ఏలేశ్వరం, మే 6: కూటమి అభ్యర్థుల గెలుపు ఖాయమని ప్రత్తిపాడు జనసేన ఇనచార్జ్ వరుపుల తమ్మయ్యబాబు అన్నారు. పట్టణంలో కూటమి నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌కు గాజు గ్లాసు గుర్తుపై, ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న వరుపుల సత్యప్రభకు సైకిల్ గుర్తుపై అమూల్యమైన ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, అలమండ చలమయ్య, యండగుండి నాగబాబు, కోనాల వెంకట రమణ, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పలివెల వెంకటేష్, వరుపుల సాయి కిరణ్, బొట్ట సురేష్, చిక్కాల లక్ష్మణరావు, వైభోగుల సుబ్బారావు పాల్గొన్నారు.

ద్వారంపూడి ప్రతీ అవినీతిపై పోరాటం చేశాం

కాకినాడ సిటీ కూటమి అభ్యర్థి కొండబాబు

కాకినాడ సిటీ, మే 6: గత ఐదేళ్లలో కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి చేసిన ప్రతీ అవినీతిపై పోరాటం చేశామని, ఓఎన్‌జీసీ నుంచి రూ.వెయ్యి కోట్లు కొట్టేశాడని చాలాసార్లు ఆరోపించగా ఇప్పుడు పోలీస్ కంప్లైంట్ ఇవ్వడం విడ్డూరంగా ఉందని కాకినాడ సిటీ టీడీపీ- జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబు అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాకినాడ ప్రజలు పన్నుల రూపంలో చెల్లించిన రూ.500కోట్లు సొమ్ము టీడీఆర్ బాండ్ల ద్వారా ద్వారంపూడి కాజేశాడని తాను చేసిన ఆరోపణ మీద పోలీస్ కంప్లయింట్ ఇవ్వలేదంటే వాస్తవమని ఒప్పుకున్నట్లే కదా అన్నారు. ద్వారంపూడి కోసం చాలామంది బాధితులు ఎదురుచూస్తున్నారని, ఎన్నికల తర్వాత బాధితులు ఆయన పనిపడతారన్నారు. పేదల రేషన్‌బియ్యం కూడా ద్వారంపూడి లాగేసుకుని దొంగ బియ్యాన్ని పోర్టు ద్వారా ఎగుమతి చేయించాడన్నారు. ఏటీఎంల్లో దొంగ నోట్లు పెట్టించింది ద్వారంపూడి కాదా అని ప్రశ్నించారు. జయలక్ష్మి కోపరేటివ్ బ్యాంకు ఆస్తులు కాజేశాడన్నారు. కాకినాడలోని సీబీసీఎన్‌సీ ఆస్తులను కొట్టేశాడన్నారు. కాకినాడ ప్రజలకు ఇళ్లు కట్టిస్తామని కొమరగిరిలో కొన్న ఇళ్ల స్థలాల్లో రూ.650కోట్లు కొటేశాడన్నారు. తాను అధికారంలోకి వచ్చిన తర్వాత కాకినాడలోనే టిడ్కో ఇళ్లు కట్టించి ఇస్తానని, వేరే చోట స్థలమైతే రెండు సెంట్లు ఇస్తానని తెలిపారు. సమావేశంలో నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, నాయకులు తుమ్మల రమేష్, వొమ్మి బాలాజీ, బలసాడి రంగారావు పాల్గొన్నారు.

'ఎన్నికల్లో జగన్‌ను నమ్మి తప్పు చేశాం'

కాకినాడ సిటీ, మే 6: గత ఎన్నికల్లో జగన్ మాయమాటలు నమ్మి ఎస్సీలం ఓట్లు వేసి గెలిపించి తప్పు చేశామని జనసేన కాకినాడ పార్లమెంట్ ప్రచార కమిటీ సభ్యుడు, దళిత నాయకుడు టీవీ రామారావు చెప్పుతో కొట్టుకున్నారు. స్థానిక గొడారిగుంటలోని ఆయన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కూటమికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ఎస్సీల ఓట్లతో 151 సీట్లు నెగ్గిన జగన్‌రెడ్డి కళ్లు బైర్లు కమ్మి ఎస్సీలపై దారుణమైన దాడులు చేయించాడన్నారు. డాక్టర్ సుధాకర్ నుంచి డ్రైవర్ సుబ్రహ్మణ్యం వరకు ఎంతో మందిని పొట్టన పెట్టుకున్నాడన్నారు. దళిత సంక్షేమ పథకాలు రద్దు చేసిన దళిత ద్రోహి జగన్‌రెడ్డి అన్నారు. తాను అదే పార్టీ నుంచి దురాగతాలు తట్టుకోలేక వెనక్కి వచ్చానన్నారు. వాళ్ల ఆగడాలకు అడ్డుకట్ట వేసే నాయకుడు పవన్ అని నాలుగేళ్ల క్రితం జనసేనలోకి వచ్చానన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ కూటమికి మద్దతు ఇస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, అదృష్టంగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పలివెల నవీన్ పాల్గొన్నారు.

నేడు సీఎం జగన్ రాక

కోరుకొండ, మే 6: ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో ప్రధానపార్టీలు బహిరంగ సభలు, రోడ్‌షోలు నిర్వహిస్తున్నాయి. మంగళవారం ఉదయం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాజానగరం నియోజకవర్గం కోరుకొండలో రోడ్‌షో నిర్వహించనున్నారు. కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి టెంపుల్ రోడ్డులో సీఎం జగన్మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల ముందు రోడ్‌షో నిర్వహించారు. ఇప్పుడు కూడా సరిగ్గా అదే ప్రాంతంలో రోడ్‌షో నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. రాజానగరం నియోజకవర్గం నుంచి ప్రజలను సమీకరించడానికి వైసీపీ నాయకులు, కార్యకర్తలు రంగంలోకి దిగారు. గ్రామాల వారీ జన సమీకరణ చేపట్టారు.

అధిక ఉష్ణోగ్రత హెచ్చరికలతో జాగ్రత్తలు తీసుకోవాలి : కలెక్టర్

కలెక్టరేట్ (కాకినాడ), మే 6: ఏపీ విపత్తుల నివారణ సంస్థ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నందున ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని కాకినాడ కలెక్టర్ జె.నివాస్ సూచించారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో దుకాణాలు, సంస్థలు, పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు.

జిల్లాలో సోమవారం మూడోరోజు 4434మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకున్నారని జిల్లా కలెక్టర్ జె.నివాస్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. మూడురోజులుగా మొత్తం 12329మంది ప్రభుత్వఉద్యోగులు ఓటుహక్కు వినియోగించుకున్నారన్నారు.

కలెక్టర్ పోస్టల్ బ్యాలెట్ సందర్శన

కార్పొరేషన్ (కాకినాడ), మే6: కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె.నివాస్ సోమవారం సందర్శించారు. అక్కడ జరుగుతున్న పోలింగ్‌ను పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులు, ఓటింగ్‌కు హాజరైన వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఏర్పాట్లను పరిశీలించారు. ఇతర జిల్లాల్లో ఓటు హక్కు కలిగి ఇక్కడ ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు ఈనెల 7,8న పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోనున్నందున ఏర్పాట్లను కాకినాడ సిటీ ఆర్వో జె.వెంకటరావు కలెక్టర్ వివరించారు.

కమిషనింగ్ ప్రక్రియ పరిశీలన

ఈవీఎంలలో బ్యాలెట్, అభ్యర్థుల గుర్తులను నిక్షిప్తం చేసే కమిషనింగ్ ప్రక్రియ సోమవారం కొనసాగింది. కాకినాడ పార్లమెంటుకు సంబంధించి మెక్లారిన్ స్కూల్ ఆవరణలోని ఎన్నికల సామాగ్రి పంపిణీకేంద్రంలో అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో కమిషనింగ్ ప్రక్రియను ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎస్.గణేష్, ఆర్వో జె.వెంకటరావు పరిశీలించారు.

పోస్టల్ బ్యాలెట్‌కు మరో 2 రోజులు

సర్పవరం జంక్షన్, మే 6: పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే ఎన్నికల సిబ్బంది కోసం ఈనెల 7,8న ఓటు నమోదు వేసుకునే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించినట్లు ఆర్వో ఇట్ల కిషోర్ తెలిపారు. ఎన్నికల విధి నిర్వహణలో ఉండి పోస్టల్ బ్యాలెట్ కోసం ఫారం 12 దరఖాస్తు చేయని ఉద్యోగులు, ఫారం 12 రిటర్నింగ్ అధికారికి చేరని ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌లో ఓటు వేసేలా ఈసీ అవకాశం కల్పించిందన్నారు. మంగళ, బుధవారాల్లో నియోజకవర్గ ఆర్వో కార్యాలయంలో ఫారం 12 తీసుకుని బ్యాలెట్ వినియోగించుకోవాలని కోరారు.

జాతీయ బాలల పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

కార్పొరేషన్ (కాకినాడ), మే 6: జిల్లాలో వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన 5 నుంచి 18 ఏళ్ల లోపు గల బాలల నుంచి కేంద్ర ప్రభుత్వ స్త్రీ శిశు సంక్షేమ శాఖ జాతీయ ప్రధాన్ మంత్రి రాష్ట్రీయ్ బాల్ పురస్కారాలను ప్రదానం చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తుందని జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ సాధికారిత అధికారిని కె.ప్రవీణ తెలిపారు. ఆసక్తి గల బాలలు జూలై 31లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన బాలలకు న్యూ ఢిల్లీలో 2025 జనవరిలో దేశ రాష్ట్రపతి చేతుల మీదుగా బహుమతి ప్రశంసాపత్రాన్ని, జ్ఞాపికను అందజేయనున్నారని తెలిపారు.

అభ్యర్థితో.. ఒకరోజు

ఉధృతంగా..

వ్యూహాత్మకంగా ప్రచారం

- డివిజన్లలో విస్తృతంగా పర్యటనలు
- పార్టీలో చేరికలతో బిజీ
- కాకినాడ సిటీ అసెంబ్లీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబుతో 'అభ్యర్థితో ఒక రోజు'

కాకినాడ సిటీ, మే 6: రాష్ట్రంలో మరో ఆరురోజుల్లో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ జరగనుంది. అందుకు అనుగుణంగా కాకినాడ సిటీ అసెంబ్లీ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబు ప్రచారం ఉధృతం చేశారు. ప్రచారంలో వ్యూహాత్మక ప్రణాళికలతో ముందుకు దూసుకుపోతున్నారు. డివిజన్లలో పర్యటిస్తూ సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. వనమాడి కొండబాబుతో ఆంధ్రజ్యోతి 'అభ్యర్థితో ఒకరోజు' నిర్వహించింది. సోమవారం ఉదయంనుంచి రాత్రి వరకు వరకు ఆయన దినచర్య ఇలా సాగింది.

ఉదయం 5 గంటలకే నిద్ర లేచి..



గాంధీనగర్ పార్కులో వాకర్స్ సభ్యులతో మాట్లాడుతున్న కొండబాబు

కాకినాడ సిటీ అసెంబ్లీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబు స్థానిక జగన్నాథపురంలోని ఆయన నివాసంలో ఉదయం 5గంటలకే నిద్రలేచారు. ఆయన ఇంట్లోని జిమ్‌లో గంటపాటు వ్యాయామం చేశారు. అక్కడినుంచి ఉదయం 6.30 గంటలకు గాంధీనగర్ పార్కులో వాకింగ్ చేసిన తర్వాత వాకర్స్‌ను కలిసి కూటమికి ఓటు వేసి రాష్ట్రంలో సంక్షేమ పాలనకు తోడ్పాటు అందించాల్సిందిగా అభ్యర్థించారు. ఇంటికి చేరుకుని స్నానాధికాలు, పూజలు పూర్తిచేసుకుని అల్పాహారం స్వీకరించారు. ఉదయం 9 గంటల సమయంలో కొద్దిసేపు ఆంధ్రజ్యోతి దినపత్రికను చూశారు. అనంతరం తన కుమారులు, తన అన్న కుమారులతో సమావేశమై కొద్దిసేపు ప్రచార ఏర్పాట్లపై చర్చించారు.

టీడీపీలో చేరికలు



పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న కొండబాబు

ఉదయం 10 గంటల సమయంలో కొండబాబు తన చాంబర్‌లోకి చేరుకుని ఎన్నికల ప్రచార సన్నాహాలను పరిశీలించారు. అనంతరం పెద్ద సంఖ్యలో టీడీపీలో చేరికలు జరిగాయి. వివిధ డివిజన్ల నుంచి వచ్చిన వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. వైసీపీ నుంచి టీడీపీలో చేరిన మినీవ్యాన్ అసోసియేషన్‌సభ్యులతో మాట్లాడారు. 32వ డివిజన్‌నుంచి పార్టీలో చేరిన యువకులు, ముస్లింలకు పార్టీ కండువాలు వేసి జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు.

మీడియా సమావేశంలో హెచ్చరిక



డమ్మీ ఈవీఎంను పరిశీలిస్తున్న కొండబాబు

ఉదయం 12 గంటలకు జిల్లా టీడీపీ కార్యాలయానికి చేరుకుని కొండబాబు మీడియా సమావేశం నిర్వహించారు. వైసీపీ అభ్యర్థి ద్వారంపూడి అవినీతిని ఎండగట్టారు. ద్వారంపూడిని ఖబడ్దార్ అంటూ గట్టిగా హెచ్చరించారు. ప్రజలు కాకినాడ నగరాన్ని కాపాడుకోవాలని చేతులు జోడించి దణ్ణం పెడుతూ అభ్యర్థించారు. అనంతరం బూత్ లెవెల్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించి మార్గదర్శనం చేశారు. మధ్యాహ్నం 3 గంటల సమయలో ఇంటికి చేరుకుని భోజన విరామం అనంతరం సాయంత్రం 5 గంటలకు తన చాంబర్‌కు చేరుకుని పార్టీశ్రేణులతో సమావేశమయ్యారు. అనంతరం బూత్ లెవెల్‌లో ఓటర్లను అభ్యర్థి నెంబర్‌పై అవగాహన కల్పించేందుకు సిద్ధం చేసిన డమ్మీ ఈవీఎంను, డమ్మీ బ్యాలెట్ పేపర్‌ను పరిశీలించారు. అనంతరం సాయంత్రం 6 గంటల వరకు పార్టీలో చేరికలు జరిగాయి.

సాయంత్రం ఎన్నికల ప్రచారం



45వ డివిజన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కొండబాబు

సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు కొండయ్యపాలెం తదితర ప్రాంతాల్లో కొండబాబు ఎన్నికల ప్రచారం జరిపారు. సైకిల్ గుర్తుకు, గాజుగ్లాసు గుర్తుకు ఓట్లు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. తొలుత నూకాలమ్మ ఆలయంలో పూజలు జరిపారు. పలుచోట్ల మహిళలు హారతులిస్తూ స్వాగతం పలికారు. అనంతరం రాత్రి 9 గంటలకు ఇంటికి చేరుకున్నారు.

ద్వారంపూడి కాకినాడకు గంజాయి, డ్రగ్స్ తెచ్చాడు: కొండబాబు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కొండబాబు

కాకినాడ సిటీ, మే 6: గత టీడీపీ ప్రభుత్వహయాంలో తాను కాకినాడ అభివృద్ధికి స్మార్ట్ సిటీగా ఎంపిక చేయిస్తే ఈ ఐదేళ్ల వైసీపీ పాలనలో ద్వారంపూడి కాకినాడకు గంజాయి, డ్రగ్స్ తెచ్చాడని కాకినాడ సిటీ అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబు విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆయన 45వ డివిజన్‌లో పర్యటించి ఓటును అభ్యర్థించారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు గుమ్మళ్ల చిన్న, సుంకర రామకృష్ణ, కేళంగి ప్రసాద్, వాకాడ శ్రీనివాసరావు, మూడే రాజబాబు, దీనా అనిల్, అంకం నాయుడు పాల్గొన్నారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి కొండబాబును గెలిపించాలని 25వ డివిజన్‌లో వనమాడి సుష్మారేఖ ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి కూటమి మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు.

డబ్బు పంచేందుకు మనుషులు దిగారు : రాజప్ప

పెద్దాపురం, మే 6: రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాలకు డబ్బు పంపిణీ చేసేందుకు సీఎం జగన్ కడప నుంచి మనుషులను పంపారని నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మకాయల చినరాజప్ప ఆరోపించారు. మండలంలోని ఆనూరులో సోమవారం నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన పలు ఆరోపణలు చేశారు. నియోజకవర్గానికి కడప నుంచి 160 మందిని లాడ్జిల్లో దింపార న్నారు. అక్కడ బస చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని 2 రోజుల కిందట ఎన్నికల కమిషనర్, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని విమర్శించారు. పైగా పోలీసులు అక్కడ ఎవరూ లేరని ఈసీని పక్కదారి పట్టిస్తున్నారన్నారు. కడప నుంచి వచ్చిన వారు ఎక్కడ బస చేస్తున్నారో నిరూపిస్తా నని సవాల్ చేశారు. పోలీసులు పట్టించుకోకపోతే నియోజక వర్గంలో ఇబ్బందులు వచ్చే పరిస్థితి ఉందన్నారు. డీజీపీ సీఎంకి తొత్తుగా వ్యవహరించడంతోనే ఆయనపై ఈసీ వేటు వేసిందన్నారు.

'ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు సహకరించాలి'

కాకినాడ క్రైం, మే 6: ఈనెల 13న సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని సెబ్ అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మి అన్నారు. కాకినాడ వన్‌టౌన్, పోర్ట్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాల్లో అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ప్రత్యేక బలగాలతో పోలీస్ కవాతు నిర్వహించారు. ప్రజలకు ఓటుహక్కుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రజలకు రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటుహక్కును ప్రజలు స్వేచ్ఛగా వినియోగించుకునేలా భరోసా కల్పించేందుకు కేంద్ర పోలీస్ బలగాల భద్రత, భరోసా ఉంటుందని కవాతు నిర్వహించామన్నారు. కాకినాడ ఎస్‌డీపీవో హనుమంతురావ్, వన్‌టౌన్ సీఐ వి.సురేష్‌బాబు ఉన్నారు.

రాజకీయాల్లో నటించకండి...

మీ ముగ్గురు భార్యలను పరిచయం చేయండి

పవన్‌కల్యాణ్‌పై ముద్రగడ ఫైర్

కిర్లంపూడి, మే 6: రాజకీయాల్లో నటించకండి.. సినిమాల్లో నటించండి.. మీ ముగ్గురు భార్యలను కూడా వేదిక మీద పరిచయం చేయండి.. అంటూ వైసీపీ నేత ముద్రగడ పద్మనాభం జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాకినాడ జిల్లా కిర్లంపూడిలో ఆయన విలేఖరులతో మాట్లాడారు. 'మీ కుటుంబ విషయాలు.. వ్యక్తిగత విషయాలను నేను ఎప్పుడు ప్రస్తావించలేదు. నా కూతురిని రోడ్డు మీదకి తీసుకువచ్చారు.. ఇప్పుడు నేను రోడ్డు ఎక్కాను. మెగా ఫ్యామిలీలో మీ పిల్లల పరిస్థితి ఏంటో మీరే చెప్పాలి. నా కుమార్తె వెనుక ఉన్న గౌరవ పెద్దలు నా కుమార్తెను పిఠాపురంలో పాదయాత్రకు ప్రచారానికి వాడుకోవాలని మనవి చేస్తున్నా. భయపడేది లేదు. మీ గురువు గారి ఆదేశాలతో నా కుటుంబంలో చిచ్చు పెట్టారు. నాకు గాని నా భార్యకు గాని అనారోగ్య పరిస్థితి వచ్చిన నా కుమార్తెను నా ఇంటికి పంపవద్దు అని గౌరవ పెద్దలకు మనవి చేస్తున్నా..' అని అన్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం • తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

చిన్నారి ఆపరేషన్‌కు ఆర్థిక సాయం

పెద్దాపురం, మే 6: చిన్నారి ఆపరేషన్‌కు మిషన్ అన్నపూర్ణ సహాయ నిధి ద్వారా చిన్నారి ఆపరేషన్ నిమిత్తం రూ.లక్ష ఆర్థికసాయం అందచేసినట్టు సహాయ నిధి వ్యవస్థాపకుడు దేవత రాజేష్ కుమార్ తెలిపారు. రాజమహేంద్రవరానికి చెందిన ప్రత్యక్షవర్ధిని అనే చిన్నారి రక్తహీనత వ్యాధితో బాధపడుతున్నట్లు తెలియడంతో దాతల సహాయ సహకారాలతో రూ.1,03,500 నగదును సేకరించి తల్లిదండ్రులకు అందజేశామన్నారు. రౌతు గోవిందు, విజయలక్ష్మీ, శివాజీ, శ్రీనివాసరావు, రేవంత్ పాల్గొన్నారు.

కూటమితోనే రాష్ట్రాభివృద్ధి

పెద్దాపురం అభ్యర్థి నిమ్మకాయల చినరాజప్ప



పెద్దాపురం: ఆనూరులో ప్రచారంలో చినరాజప్ప

పెద్దాపురం, మే 6: రాష్ట్రాభివృద్ధి జరగాలంటే టీడీపీ-జనసేన- బీజేపీ కూటమికే పట్టం కట్టాలని పెద్దాపురం ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. మండలంలోని ఆనూరు గ్రామంలో సోమవారం ఆయన ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ప్రతీ ఇంటికీ తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు సైకిల్‌కు ఓటు వేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. మహిళలు, ప్రజలు ఆయనను పూలమాలలతో అడుగడుగునా స్వాగతించి హారతులు ఇచ్చారు. అనంతరం రాజప్ప మాట్లాడుతూ వైసీపీ పాలన లో రాష్ట్రంలో అభివృద్ధి సర్వనాశనమైందన్నారు. కూటమి అధికారం చేపట్టడం ద్వారా రాష్ట్ర భవిష్యత్తు మెరుగు పడుతుందన్నారు. అధికారంలోకి వస్తే చేపట్టబోయే సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు తెలియజేశారు. ప్రజలు కూటమిని ఆదరిస్తున్నారని, ఎన్నికల్లో కూటమికి విజయం సాధించడం ఖాయమన్నారు. రాబోయేది కూటమి ప్రభుత్వమే అని, వైసీపీకి ఓటమి భయం పట్టుకుందన్నారు. ప్రజలు వైసీపీని ఛీ కొట్టే రోజులు ఇక ఎంతదూరంలో లేవన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు మాజీ సర్పంచ్ సింగన అరవింద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పవరలో రాజప్ప ప్రచారం

సామర్లకోట, మే 6: నవరత్నాలు పేరిట వైసీపీ నాయకులు రాష్ట్రాన్ని లూటీ చేశారని, ప్రజలకు పది రూపాయలు ఇచ్చి వంద రూపాయిలు దోచారని కూటమి పెద్దాపురం అభ్యర్థి నిమ్మకాయల చినరాజప్ప ఆరోపించారు. సామర్లకోట మండలం వపర గ్రామంలో సోమవారం కూటమి నాయకులతో కలిసి రాజప్ప విస్తృత ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే తనయుడు రంగనాగ్, టీడీపీ మండలాధ్యక్షుడు తోటకూర శ్రీనివాస్, ఆకునూరి సత్తిబాబుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాజప్ప మాట్లాడుతూ మరో సారి జగన్‌కు అధికారం ఇస్తే రాష్ట్రాన్ని అంధకారం చేస్తాడన్నారు. పెత్తందారుల మోచేతి నీళ్ల తాగే బతుకులు మనకు వద్దనీ, రాబోయేది టీడీపీ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. వైసీపీ పాలకులు అధికారాన్ని అడ్డుపెట్టుకుని రాష్ట్రంలో అన్ని వ్యవస్థలనూ నాశనం చేశారని రాజప్ప ఆరోపించారు. కూటమి గెలుపుతోనే రాష్ట్రంలో అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ప్రత్యేక ప్రచార వాహనంపై నిలుచుని ప్రజలకు అభివాదం చేసుకుం టూ తనకు సైకిల్ గుర్తుపై, ఎంపీ అభ్యర్థి తంగెళ్లకు గాజు గ్లాసు గుర్తులపై ఓట్లేసి గెలిపించాలని కోరారు. ప్రచారంలో చీకట్ల వెంకటేష్, ముమ్మిడి సూరిబాబు, ముచ్చెర్ల కళ్యాణ్, వింటి నాగరాజు పాల్గొన్నారు.







సామర్లకోట: పవరలో ప్రచారం నిర్వహిస్తున్న రాజప్ప, మంగళహారతులు ఇస్తున్న మహిళలు, పెద్దాపురం: ఆనూరులో నమస్కరిస్తున్న రాజప్ప

వలంటీర్లకు తాయిలాలు

రూ. 2 వేలు వంతున పంపిణీ

సర్పవరం జంక్షన్, మే 6: సార్వత్రిక ఎన్నికలు మరో వారం రోజుల్లో జరుగనున్న నేపథ్యంలో వైసీపీ నాయకులు వలంటీర్లను ప్రసన్నం చేసుకునేందుకు పావులు కదుపుతున్నారు. వలంటీర్ల సేవలను మరింత విస్తృతంగా వాడుకునేందుకు వీలుగా కాకినాడ రూరల్ నియోజకవర్గంలో వైసీపీ నాయకులు ఒక్కో వలంటీర్‌కు తలో రూ.2 వేలు చొప్పున సోమవారం రాత్రి నుంచి అందజేస్తున్నారు. ఆర్టీవో ఆఫీసు రోడ్డులో గల ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో కాకినాడ వైసీపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న చలమలశెట్టి సునీల్ అనుచరులు వలంటీర్లతో ఆత్మీయ సమావేశం పేరిట సమావేశం ఏర్పాటు చేసి వలంటీర్లకు తలో రూ.2వేలు నగదు అందజేసినట్లు తెలిసింది. ఎన్నికలకు ముందు మరోసారి పారితోషికం అందిస్తామని హామీఇచ్చారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్ననేపథ్యంలో ఈ విధంగా వైసీపీ నాయకులు వలంటీర్లను ప్రలోభాల ఎర వేసి ఎన్నికల్లో వాడుకునేందుకు వ్యూహాలు సిద్ధం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో ప్రచారంలో పాల్గొనేందుకు వెళ్తున్న జనసేన కూటమి అభ్యర్థి పంతం నానాజీ ప్రచార వాహనంతో పాటూ కార్యకర్తలను సర్పవరం పోలీసులు అడ్డుకోవడం వివాదానికి దారితీసింది. రహదారికి అడ్డంగా సర్పవరం పోలీసులు వాహనాలు అడ్డంపెట్టి అడ్డుకోవడం పట్ల నానాజీ పోలీసుల తీరును తప్పుపట్టారు. ఫంక్షన్ హాల్లో డబ్బులు పం చుతున్నారని కార్యకర్తలు ఆరోపించడం, పోలీసులతో వాగ్వాదానికి దిగడం పట్ల నానాజీ కార్యకర్తలకు సర్దిచెప్పారు. వైసీపీ నాయకులు ప్రజల నుంచి దోచుకున్న డబ్బును తిరిగి పంచుతుంటే మనకు అభ్యంతరం ఎందుకని, అడ్డుచెప్పవద్దని కార్యకర్తలను వారించారు. కోడ్ అమల్లో ఉన్నా సరే వైసీపీ నాయకులకు పోలీసులు పని చేస్తున్నారని, ప్రచారం చేసుకోకుండా పోలీసులు వారించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.

సత్యదేవుడి ఆలయానికి రంగులు

అన్నవరం, మే 6: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో ఈనెల 18 నుంచి ప్రారంభంకానున్న స్వామివారి దివ్య కల్యాణోత్సవాల సందర్భంగా ఆలయంలో రంగులు వేసే కార్యక్రమాలు ప్రారంభించారు. ఇటీవల శ్రీరామనవమి సందర్భంగా రామాలయానికి మాత్రమే రంగులు వేయగా సత్యదేవుడి బ్రహ్మోత్సవాలకు ఆలయంలో అన్ని వ్రతమండపాలు, తూర్పు,పశ్చిమ రాజగోపురంలకు రంగులు వేయనున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. ఈఏడాది స్వామివారి దివ్యకల్యాణోత్సవాలు అంగరంగవైభవంగా చేపట్టేందుకు ఇప్పటికే శాఖల వారీగా లక్ష్యాలను నిర్దేశించగా పనులు చురుకుగా జరుగుతున్నాయి. సత్యదేవుడి కల్యాణోత్సవాలు ఈనెల 18 నుంచి 24 వరకు జరగనున్నాయి. గతేడాది తీసుకొచ్చిన సంప్రదాయాలను పక్కనబెట్టి పూర్వపు సంప్రదాయం ప్రకారం కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలయ ఈవో రామచంద్రమోహన్ తెలిపారు. గతేడాది స్వామివారి కల్యాణ తలంబ్రాలను గోటితో ఒలిచినవి వినియోగించగా అన్నవరం ఆలయానికి అటువంటి సంప్రదాయం లేదని బియ్యపు అక్షింతలు వినియోగించనున్నారు. అదేవిధంగా శ్రీపుష్పయోగం గతేడాది ఆరుబయట వార్షిక కల్యాణవేదికపై చేపట్టగా వైదిక కమిటీ సూచనతో ఈ ఏడాది పూర్వపు పద్ధతిలో అనివేటి మండపంలో చేపట్టాలని నిర్ణయించారు.

దుర్గాడలో నక్షత్ర భస్మాభిషేకం



గొల్లప్రోలు, మే 6: గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో నక్షత్ర భస్మాభిషేకం నిర్వహించారు. సోమవారం, మాసశివరాత్రి సందర్భంగా ఆలయంలో పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామికి మహాగణపతిపూజ, మహాన్యాస పారాయణ, 27 రకాల ద్రవ్యాలతో విశేష అభిషేకం చేశారు. 27కిలోల విభూది, 27 నక్షత్రాల పూర్వక భస్మాభిషేకం నిర్వహించారు. స్వామిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేక అలంకారం చేశారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు పూజాది కార్యక్రమాలు నిర్వహించగా, ఆలయ సేవాసమితి సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

'వైసీపీ ఎమ్మెల్యే పొన్నాడ అవినీతి తిమింగళం'



తాళ్లరేవు విలేకర్ల సమావేశంలో అగ్నికులక్షత్రియులు

తాళ్లరేవు, మే 6: ముమ్మిడివరం వైసీపీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ అవినీతి తిమింగళమని, జగనన్న ఇళ్ల స్థలాల పేరుతో తాళ్లరేవు మండలంలో బినామీల ద్వారా భారీ అవినీతి చేశారని గాడిమొగ సర్పంచ్ కామాడి గోవలక్ష్మి భర్త మాతరాజు, ఎంపీటీసీ వనమాడి వేణి భర్త నూకరాజు ఆరోపించారు. సోమవారం తాళ్లరేవు టీడీపీ కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడారు. గాడిమొగలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే పొన్నాడ మాపై తప్పుడు ఆరోపణలు చేయడంపై వారు ఖండించారు. మాపై చేసిన ఆరోపణలు అవాస్తవమని, శ్రీవేంకటేశ్వరస్వామిపై ప్రమాణం చేసి నిరూపించాలని చాలెంజ్ చేశారు. గాడిమొగ జగనన్న ఇళ్లస్థలాల లేఅవుట్ కోసం 7ఎకరాల70సెంట్లు గ్రామకంఠం భూమికి సంబంధించి బినామీపేర్లమీద ప్రభుత్వం నుంచి ఎమ్మెల్యే డబ్బులు తీసుకున్నారని ఆరోపించారు. లక్ష్మీపతిపురంలో ఇళ్లస్థలాల లేఅవుట్ కోసం 3ఎకరాల 30సెంట్లు భూమికి సంబంధించి ప్రభుత్వం నుంచి ఎమ్మెల్యే డబ్బులు తీసుకున్నారని కానీ అక్కడ రెండు ఎకరాలు మాత్రమే ఉండటంతో ఎమ్మెల్యే బండారం బయటపడుతుందని లబ్ధిదారులకు ఇళ్లస్థలాలు ఇవ్వకుండా నిలిపివేశారన్నారు. గాడిమొగ మహిళా సర్పంచ్ తనను ఎదిరించి ఎన్నికల్లో నిలబడి గెలిచిందని కక్షతో ఓడిపోయిన వ్యక్తిని వార్డుమెంబరు చేసి ఉపసర్పంచ్ పదవిని కట్టబెట్టి గాడిమొగలో ఏ అభివృద్ధి లేకుండా చేశారని ఆరోపించారు. మాపై 13 అక్రమ కేసులు పెట్టించి చాలా ఇబ్బందులు పెట్టడంతోనే వైసీపీలో ఇమడలేక టీడీపీలో చేరామని వారు తెలిపారు. ఎమ్మెల్యే అవినీతి అక్రమాలపై బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. సమావేశంలో అగ్నికుల క్షత్రియులు కామాడి చినమాతరాజు, కొప్పాడి పెదధర్మారావు, సంగాడి కామేశ్వరరావు, లంకే వీరబాబు, పెసింగి ఈశ్వరరావు, చింతా వీర్రాజు, కొక్కిలగడ్డ రాము, పెసింగి నాగరాజు, కొక్కిలిగడ్డ బాబూరావు, మల్లాడి సీతారామరాజు ఉన్నారు.

పవన్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలి : వర్మ



రవీంద్రపురంలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న వర్మ

కొత్తపల్లి, మే 6: పిఠాపురం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పవన్‌కల్యాణ్‌ను అధిక మెజార్టీతో నెగ్గించాలని, ఇక్కడ పవన్ విజయంసాధిస్తే తాను గెలిచినట్లేనని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ స్పష్టం చేశారు. కొత్తపల్లి రవీంద్రపురంలో సోమవారం సాయంత్రం ఆయన కూటమి పార్టీల కార్యకర్తలతో కలిసి గాజు గ్లాసుకు ఓట్లేసి విజయం చేకూర్చాలని ఆడపడుచులు, తమ్ములకు చేతులు జోడించి అభ్యర్థించారు. వచ్చేది ఉమ్మడి ప్రభుత్వమేనని, స్థానిక సమస్యలు పరిష్కారంలో తాను అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ప్రచారంలో టీడీపీ నాయకులు గవర నాగేశ్వరరావు, రెడ్నం దొరబాబు, జనసేన నాయకులు గవర రాంబాబు, పెనుపోతుల నాని, సానా నాగు, చేనేత కార్మికసంఘ ప్రతినిధి రొబ్బి నటరాజు, మత్స్యకార నాయకుడు సూరాడ రాజు, దళిత నాయకుడు లాజర్ తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసు నమోదు చేయాలి

టీడీపీ నేతల డిమాండ్



గొల్లప్రోలు పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నేతలు

గొల్లప్రోలు రూరల్, మే 6: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో మెగా హీరో సాయిధరమ్ తేజపై డ్రింక్‌బాటిల్‌తో దాడి, సంఘటనలో నల్లల శ్రీధర్‌కు తీవ్ర గాయపడిన సంఘటనపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని టీడీపీ నేతలు డిమాండ్ చేశారు. ఇందుకు ప్రోత్సహించిన ఉపసర్పంచ్ దాసం వెంకటేష్‌పై విచారణ నిర్వహించి చట్టరీత్యా శిక్షించాలని వారు గొల్లప్రోలు పోలీసుస్టేషన్‌లో ట్రైనీ డీఎస్పీ ప్రమోద్, పిఠాపురం సీఐ శ్రీనివాస్‌లకు సోమవారం సాయంత్రం లిఖితపూర్వంగా ఫిర్యాదు చేశారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ప్రెస్‌మీట్ పెట్టడమే గాక పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మను దుర్భాషలు ఆడుతూ అభ్యంతరకర వాఖ్యలు చేసిన వెంకటేష్‌పై చట్టప్రకారం చర్యలు చేపట్టాలని కోరారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన వారిలో గొల్లప్రోలు మాజీ జడ్పీటీసీ మడికి ప్రసాద్, చిట్టూరి సుబ్బారావు, ఎస్.నాగబాబు, జనసేన మండలాధ్యక్షుడు అమరాది వల్లీ రామకృష్ణ, అడపా విజయకుమార్, గోకరకొండ సత్యనారాయణ, వి.సుబ్బరామకృష్ణ తదితరులు ఉన్నారు.

డీఎస్పీ కట్టుకథలు చెబుతున్నారు : వర్మ

పిఠాపురం, మే 6: గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలో రోడ్‌షో నిర్వహిస్తున్న మెగా హీరో సాయిధరమ్‌తేజ్‌పై డ్రింక్‌బాటిల్‌తో దాడి చేయడం, అది తగిలి నల్లల శ్రీధర్‌కు తీవ్రంగా గాయపడిన సంఘటనపై కాకినాడ డీఎస్పీ కట్టుకథలు చెబుతున్నారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ పోలీసుల తీరుపై తీవ్రంగా మండిపడ్డారు. కనీసం దర్యాప్తు చేయకుండానే కేసును పక్కదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. సాయిధరమ్‌తేజ్ వెళ్లిన 15 నిమిషాల తర్వాత సంఘటన జరిగిందనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తేజ్‌పై డ్రింక్ బాటిల్‌తో దాడి సంఘటనకు సంబంధించి వీడియోలు, ఆధారాలు ఉన్నాయన్నారు. డీఎస్పీ మాటలు ఎలా ఉన్నాయంటే గాలికి గులకరాయి ఎగిరి వచ్చి గాయపరిచినట్లు ఉందని ఎద్దేవా చేశారు. వైసీపీ నాయకులు, ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత ప్రోద్బలంతోనే డీఎస్పీ ఇటువంటి మాటలు చెబుతున్నారని తెలిపారు. పవన్ గెలుపు ఖాయమైందని, కనీసం మెజార్టీ అయినా తగ్గించాలని వైసీపీ నేతలు కుట్రలు పన్నుతున్నారని, గొడవలు పెట్టి ప్రజలను భయాందోళనలకు గురిచేసి ఓటింగ్‌కు రాకుండా చేయాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. రోడ్‌షోలకు బందోబస్తు నిర్వహించడంలో పోలీసులు విఫలమయ్యారని ఆరోపించారు. జరిగిన సంఘటనలపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

'కూటమిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి'

గండేపల్లి, మే 6: పాత, కొత్త కలయికతో అందరూ సమన్వయంగా పనిచేసి రాబోయే ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిని అత్యధిక మెజార్టీతో గెలిపించి జగ్గంపేట అభ్యర్థి జ్యోతుల నెహ్రూను ఎమ్మెల్యేగా చేసుకునే బాధ్యత అందరిపై ఉందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ అన్నారు. మండలంలో రామయ్యమ్మపాలెంలో మాజీ సర్పంచ్ గొల్లవిల్లి బాబురావు తన అనుచరులతో వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. నవీన్‌కుమార్ పార్టీలోకి చేరినవారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. నవీన్ మాట్లాడుతూ ఈ ఏడు రోజులు చాలా కీలకమని బ్యాలెట్ డమ్మీలతో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో మారిశ శ్రీనివాస్, దాసరి సత్తిబాబు, గొల్లవిల్లి అప్పలరాజు, ముప్పర్తి సత్యనారాయణ, కర్రి శివయ్య పాల్గొన్నారు.



టీడీపీలో చేరినవారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న నవీన్

నిబంధనలు పట్టవా!



గొల్లప్రోలు రూరల్, మే 6: ఎన్నికల నిబంధనలు పటిష్టంగా అమలు చేస్తున్నామని అధికారులు చెబుతున్నా పలుచోట్ల ఉల్లంఘనలు జరుగుతున్నాయి. తాటిపర్తిలో ఎండీయూ వాహనంపై జగన్ చిత్రపటంపై అంటించిన పేపర్ చిరిగిపోయి జగన్ ఫోటో కనిపిస్తున్నా వదిలివేశారు. టీడీపీ, జనసేన నాయకులు అభ్యంతరం తెలిపారు.

రాష్ట్రాభివృద్ధే కూటమి ధ్యేయం : సత్యప్రభ

ప్రత్తిపాడు, మే 6: రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా టీడీపీ కూటమి పని చేయనుందని ప్రత్తిపాడు అభ్యర్థి వరుపుల సత్యప్రభ రాజా చెప్పారు. ప్రత్తిపాడు టీడీపీ కార్యాలయం వద్ద సోమవారం మండలంలోని ఉత్తరకంచికి చెందిన 50 కుటుంబాల వైసీపీ కార్యకర్తలు, నాయకులు ఆ పార్టీని వీడి సత్యప్రభ సమక్షంలో టీడీపీలో చేరారు. ఉత్తరకంచి సర్పంచ్ మంతెన శ్రీను, టీడీపీ జిల్లా నాయకులు ఇళ్ళ అప్పారావుల ఆధ్వర్యంలో తాడి రాజేష్, మోపుల నాని, వట్టినాని, సాకా నీరజ్, గుడాల కృష్ణ, చీమల రాజేష్, పక్కిబాను, కాశీ ఆనంద్, రెల్లి మురళి, తాడి తరుణ్, లోడ బద్రి, పేకేటి రాజు, కేటి నాని, మోకుల జగదీష్, జోసెఫ్, రాజేష్, అశోక్, కుమార్ పార్టీలో చేరారు. సీతయమ్మపేట గ్రామ 4వ వార్డు మెంబర్ కొయ్యానాగచంద్రయ్య, మాజీ వార్డు మెంబర్ కొయ్యా సత్యనారాయన, కొయ్యా వీరబ్బాయి, పెద్ద ఎత్తున వైసీపీ కార్యకర్తలు ఆ పార్టీని వీడి సత్యప్రభ సమక్షంలో టీడీపీలో చేరారు. శంఖవరం మండలం టీడీపీ నాయకులు పర్వత సురేష్, బద్ది రామారావు, వెన్న శివ, బద్ది రమణ పాల్గొన్నారు. ప్రత్తిపాడు, శంఖవరం మండలాల్లోని యుజేపురం, పోతులూరు, కొంత్తంగి,కొత్తూరు గ్రామాలకు చెందిన 100 కుటుంబాల జనసైనికులు గొర్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్తిపాడు విచ్చేసి సత్యప్రభకు సంఘీభావం తెలిపారు. బీజేపీ నాయకుడు గంటా బాలుదొర ఆధ్వర్యంలో బీజేపీ బూత్ కమిటీల సభ్యులు స్థానిక పార్టీ కార్యాలయం వద్ద సత్యప్రభను కలిసి మద్దతు తెలిపారు. సత్యప్రభతో కలిసి ర్యాలీగా పెద్దనాపల్లి తరలివెళ్లారు ధర్మవరంలో సత్యప్రభ తనయుడు వరుపుల సాయితర్షిత్ ప్రచార పాదయాత్ర నిర్వహించారు. లంపకలోవలో సత్యప్రభ కుమార్తె సత్యమాధురి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

శంఖవరం: కత్తిపూడికి చెందిన వైసీపీ నేతలు నమ్మి తాతారావు, కుర్రే రాము, బురా అప్పారావు, తోట అశోక్, బురాదేవుడు, పలువురు ప్రత్తిపాడులో వరుపుల సత్యప్రభ సమక్షంలో టీడీపీలో చేరగా సాదరంగా ఆహ్వానించారు.

రౌతులపూడి: మండలంలోని రాజవరం, దిగిశివాడ, ఆర్. వెంకటాపురం, గంగవరం, లచ్చిరెడ్డిపాలెం గ్రామాల్లో వరుపుల సత్యప్రభ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చింతకాయల రాజు, పాశిల సూరిబాబు, గుర్రం రాంబాబు, చిత్రారెడ్డి, యనుముల దొరబాబు, గింజాల అప్పలరాజు దాడిశెట్టి సత్యనారాయణ, అల్లం ప్రసాద్ పాల్గొన్నారు. మూలగపూడిలో జనసేన ప్రత్తిపాడు ఇన్‌చార్జ్ వరుపుల తమ్మయ్యబాబు, టీడీపీ మండలాధ్యక్షుడు తమరాల సత్యనారాయణతో కలిసి ప్రచారం చేశారు. జనసేన ఎన్నికల కమీటి సమన్వయకర్త మేడిశెట్టి సూర్యకిరణ్, కరణం సుబ్రహ్మణ్యం, కోరుప్రోలు బాబ్జీ, నానాజీ, జేట్లా రాజా, నిర్వానాగు, పక్కుర్తి సతీష్, సలీమ్ పాల్గొన్నారు.



రౌతులపూడి: లచ్చిరెడ్డిపాలెంలో ప్రచారంలో సత్యప్రభ



ప్రత్తిపాడు: సత్యప్రభ సమక్షంలో టీడీపీలో చేరికలు



లంపకలోవలో సత్యమాధురి ప్రచారం

'ఎమ్మెల్యే ఆరోపణలు ఖండిస్తున్నాం'

కార్పొరేషన్ (కాకినాడ), మే 6: కాకినాడ నగర ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి కూటమి ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయశ్రీనివాస్‌పై చేసిన ఆరోపణలు తీవ్రంగా ఖండిస్తున్నామని జనసేన కాకినాడ సిటీ కోఆర్డినేటర్ బొలిశెట్టి సత్యనారాయణ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఏదైనా ప్రశ్నిస్తే అర్థం లేని ఆరోపణలు, సమాధానాలు చెపుతున్నారన్నారు. వ్యక్తిగత దూషణలు సంస్కారం కాదని హితవు పలికారు. గత గెలుపు ద్వారంపూడి ప్రతిభకాదని జనసేన, టీడీపీ విడివిడిగా పోటీ చేసినందున మాత్రమే గెలిచారన్నారు. ద్వారంపూడి వ్యక్తిగత వివరాలు తన వద్ద ఉన్నాయని తాను సంస్కారంతో వ్యక్తిగత విషయాలు మాట్లాడడంలేదన్నారు. కేవలం ఓడిపోతాననే భయంతో ద్వారంపూడి ఇలా మాట్లాడుతున్నారన్నారు. ప్రజలు విజ్ఞతతో ఓటు హక్కును వినియోగించుకుని మంచి అభ్యర్థిని ఎన్నుకోవాలన్నారు. కార్యక్రమంలో దుగ్గన బాబ్జి, సబ్బతి ఫణేశ్వరరావు, మాకిరెడ్డి భాస్కర్, నల్లం శ్రీనివాస్ పాల్గొన్నారు.

'ప్రజాప్రభుత్వానికి పట్టం కట్టాలి'

తుని రూరల్, మే 6: ప్రజాప్రభుత్వానికి పట్టం కట్టాలని శాసనమండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు అన్నారు. చేపూరు, రాజపేట, సీతయ్యపేట తదితర గ్రామాల్లో ఆయన ప్రచారం చేపట్టి కూటమి అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. హంసవరంలో తుని కూటమి అభ్యర్థి యనమల దివ్య పార్టీ శ్రేణులతో కలిసి ప్రచారం చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు సుర్ల లోవరాజు, చింతమనీడి నాగ సోమరాజు (అబ్బాయి), కొయ్యా శ్రీనుబాబు, యనమల రాజేష్, మోతుకూరి వెంకటేష్, ఇనుగంటి సత్యనారాయణ పాల్గొన్నారు.

పటవలలో అగ్ని ప్రమాదం

తాళ్లరేవు, మే 6: అగ్ని ప్రమాదంలో ధాన్యంరాశులు అగ్నికి ఆహుతయ్యాయి. పటవల గ్రామంలో కోట మాణిక్యం, మేడిశెట్టి రాంబాబులు 6ఎకరాలు పంటపొలం కౌలుకి సాగుచేస్తున్నారు. చేతికి వచ్చిన పంటను ధాన్యం రాశులు చేశారు. ఆదివారం అర్ధరాత్రి రాశులు, పశువులపాక ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదానికి గురై కాలిబూడిదయ్యాయి. దీంతో రైతులంతా మంటలను ఆపేందుకు ప్రయత్నించినా ప్రయోజనం లేకపోయింది. బాధితులు రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్థానిక టీడీపీ, వైసీపీ నేతలు, కౌలురైతు సంఘం నాయకులు పరిశీలించి ప్రభుత్వ అధికారులు విచారణచేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

ఉత్సాహంగా క్రికెట్ టోర్నమెంట్

కాకినాడ అర్బన్, మే 6: జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2023-24 సంవత్సరానికి ఎంఎస్ రవికుమార్‌మెమోరియల్ క్రికెట్, డాక్టర్ జై చంద్రశేఖరరావు ట్రోఫీ సోమవారం నిర్వహించారు. ఈ లీగ్ టోర్నమెంట్‌లో 20 జట్లు పాల్గొన్నాయని అసోసియేషన్ కార్యదర్శి పీఎస్ సత్యనారాయణ తెలిపారు. ఫైనల్లో తూర్పుగోదావరి జట్టు, ఫ్రెండ్స్ జట్టు తలపడగా 41 ఓవర్లలో 109 పరుగుల తేడాతో తూర్పుగాదవరి జట్టు విజయం సాధించింది. డాక్టర్ శివకుమార్, రఫీ, నక్కావెంకటేష్, ఇజ్రాయెల్‌రాజు పాల్గొన్నారు.

ఉద్యోగాలు రావాలంటే కూటమి అధికారంలోకి రావాలి

కాకినాడ రూరల్ అభ్యర్థి నానాజీ







చీడిగలో రోడ్డు షోలో పంతం నానాజీ, నానాజీకి బహుమతి అందజేస్తున్న ప్రజలు, ఇంద్రపాలెంలో ఓట్లు అభ్యర్థిస్తున్న పంతం నానాజీ

సర్పవరం జంక్షన్, మే 6: రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు రావాలంటే టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారంలోకి రావాలని, అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల భర్తీ చేయనున్నారని కాకినాడ రూరల్ అసెంబ్లీ జనసేన కూటమి అభ్యర్థి పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) తెలిపారు. సోమవారం కాకినాడ రూరల్ మండలం చీడిగ, ఇంద్రపాలెం, 42వ డివిజన్ స్వామినగర్, 3వ డివిజన్ పరిధిలో ప్రజలను ఓట్లు అభ్యర్థిస్తూ రోడ్డు షో ప్రచారం నిర్వహించారు. ప్రచారానికి విచ్చేసిన నానాజీపై ప్రజలు పెద్ద ఎత్తున పూవ్వులు జల్లుతూ బ్రహ్మరథం పట్టారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎమ్మెల్యే కన్నబాబు అనుచరులు నకిలీ ఇళ్ల పట్టాలు తయారు చేసి లక్షలాది రూపాయలకు అమ్మేసుకున్నారని ఆరోపించారు. స్వామినగర్‌లో స్థానిక వైసీపీ నాయకుడు దుర్గాప్రసాద్‌రెడ్డి నకిలీ పట్టాలు సృష్టించి కోట్లాది రూపాయలకు పట్టాలను అమ్మేసుకుని లబ్ధిదారులను మోసం చేశారన్నారు. ఈ నకిలీ పట్టాల వ్యవహారం తహశీల్దార్ లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారని, నేటికీ నకిలీ పట్టాలు విక్రయించిన వ్యక్తిపై ఏ చర్యలు తీసుకోలేదన్నారు. ఇళ్లపట్టాల పంపిణీలో ఎమ్మెల్యే అనుచరులు పెద్దఎత్తున అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. పారదర్శక పాలన, సంక్షేమం, అభి వృద్ధి కోసం కూటమి అభ్యర్థులకు ఓట్లేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా ఉదయ శ్రీనివాస్‌లను గెలిపించాలని కోరారు. పార్టీ నాయకులు నులుకుర్తి వెంకటేశ్వరరావు, కటకంశెట్టి బాబీ, పెంకే శ్రీనివాసబాబా, పితాని అప్పన్న, కరెడ్ల గోవిందు. కౌజు నెహ్రూ, మరుకుర్తి నాగబాబు, ఎం.గంగయ్య ఉన్నారు.

మోసం చేసిన వైసీపీ

జాబ్ కేలండర్ పేరుతో యువతను వైసీపీ ప్రభుత్వం మోసం చేసిందని, అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం జగన్ ప్రభుత్వానికి ఇంటికి పంపించాలని టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణ మూర్తి, మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మి అన్నారు. రమణయ్యపేట పంచాయతీ గైగోలుపాడులో కూటమి కాకినాడ రూరల్ అభ్యర్థి పంతం నానాజీ, ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్‌లకు మద్దతుగా నానాజీ కుమారుడు సందీప్‌తో కలసి ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలు పంపిణీ చేసి ఎన్నికల్లో గాజు గ్లాసు గుర్తుపై ఓట్లేసి ఎమ్మెల్యే నానాజీ, ఎంపీగా ఉదయ శ్రీనివాస్‌లను గెలిపించాలని కోరారు. పార్టీ నాయకులు రాయుడు అనిల్, కాళ్ల శ్రీను, పిల్లి బుజ్జి, బొజ్జ భవానిసాంబశివరావు, పలివెల గాయత్రి పాల్గొన్నారు.